**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 97, పేజీలు - 08

మంగళవారం,అక్టోబర్ 06, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD



Publish Your Newspaper/Website Online
Contact Us : 9666136456

# బకాయిల సుడిగుండంలో తెలంగాణ

## - రూ. 65 వేల కోట్ల పెండింగ్ బిల్లులు - రేవంత్ ప్రభుత్వానికి ఆర్థిక సవాల్!



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. డిసెంబర్ 2023లో బాధ్యతలు చేపట్టిన నాటికి గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా లభించిన రూ. 40,000 కోట్ల మేర పాత బిల్లులను క్లియర్ చేయడం కొత్త ప్రభుత్వానికి పెద్ద బాధ్యతగా మారింది. అందులోంచి ప్రాథమికంగా దాదాపు రూ. 8,000 కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించినప్పటికీ, నిరంతరం సమకూరుతున్న కొత్త బిల్లులు, పరిపాలనా వ్యయాల కారణంగా పెండింగ్ బిల్లుల భారం తగ్గే బదులు రెట్టింపైంది. ప్రస్తుతం కాంట్రాక్టర్లు, మాజీ సర్పంచులు, సరఫరాదారుల బకాయిలే ఏకంగా రూ. 51,000 కోట్లు దాటిపోవడం రాష్ట్ర ఆర్థిక ఆరోగ్య పరిస్థితికి అద్దం పడుతోంది.

**బిల్లుల మంజూరు చాలా పెద్ద సమస్య**

రోడ్లు, నీటిపారుదల, ఇతర మౌలిక వసతుల పనులు చేపట్టిన కాంట్రాక్టర్లతో పాటు గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తి చేసిన మాజీ సర్పంచులు బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ చెల్లింపులు నిలిచిపోవడంతో బ్యాంకుల నుంచి తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక కాంట్రాక్టింగ్ రంగానికి చెందిన చిన్న, మధ్యతరహా వ్యాపారులు సంక్షోభంలో కూరుకుపోయారు. ఇదివరకు చేపట్టిన పనులకే నిధులు విడుదల కాకపోవడంతో నూతన అభివృద్ధి పనుల నిమిత్తం టెండర్లు పిలిచేందుకు లేదా కాంట్రాక్టర్లు ముందుకు వచ్చేందుకు వెనుకంజ వేస్తున్నారు. ఇది రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాల వేగాన్ని తీవ్రంగా మందగించేలా చేస్తోంది.

**బకాయిల కోసం ఉద్యోగుల ఎదురుచూపులు**

ఈ వరుస బకాయిలకు తోడు ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల చెల్లింపుల సమస్య మరీ 2లో..

# కేంద్రం, ఈసీకి సుప్రీం నోటీసులు

## - సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నిర్ణయాలపై పిటిషన్లు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్‌ను సస్పెండ్ చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు సుప్రీంకోర్టు సోమవారం నిరాకరించింది. అయితే, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ సందర్భంగా ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలను సమీక్షించేందుకు మాత్రం అంగీకరించింది. ఈ అంశంపై దాఖలైన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం విచారణకు స్వీకరించింది. అనంతరం కేంద్ర ఎన్నికల కమిషన్, సీఈసీ జ్ఞానేష్ కుమార్, ఇతర ఇద్దరు ఎలక్షన్ కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిలకు ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. పట్నాకు చెందిన రాకేష్ కుమార్ సింగ్, అడ్వకేట్ శైలేంద్ర మణి త్రిపాఠి దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరిపింది. మిగతా ఇద్దరు కమిషనర్ల ఆమోదం లేకుండానే సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఈసీ అధికారాలను సొంతంగా ఉపయోగించారా? అనే అంశాలపై పిటిషనర్లు 2లో..

## ఎన్నికలపై నమ్మకం లేకుంటే

# రాజీనామా చేయాలి

### - కాంగ్రెస్ సీఎంలకు రామచందర్‌రావు సవాల్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ గెలిస్తే ఈవీఎంలు, ఎన్నికల సంఘం మంచివి, ఓడిపోతే మాత్రం ఆరోపణలు, విమర్శలు చేయడాన్ని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తప్పుపట్టారు. భారత ఎన్నికల వ్యవస్థపై ప్రపంచం గర్విస్తుంటే కాంగ్రెస్ ఏడుస్తోందని ఎద్దేవా చేశారు. ఈవీఎంల ఎన్నికలు నిజంగా చెల్లవని కాంగ్రెస్ భావిస్తే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కేరళ, హిమాచల్ ప్రదేశ్ సీఎంల చేత రాజీనామా చేయించాలని ఛాలెంజ్ చేశారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన రాష్ట్ర పదాధికారుల సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పాల్గొని మాట్లాడారు. ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత విజయవంతమైన ప్రజాస్వామ్య దేశం భారత్ అని ఆయన పేర్కొన్నారు. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సైతం భారత ప్రధాని నరేంద్ర మోదీతో మాట్లాడుతూ, కేంద్రం ఎన్నికల సంఘం 2లో..

## కేబీఆర్ పార్క్ చుట్టూ ఇక శాశ్వతంగా వన్‌వే

### - కొత్త ప్లాన్‌తో రూ.400 కోట్ల ఆదా



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లో అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఒకటైన కేబీఆర్ పార్క్ వద్ద ట్రాఫిక్ లేకుండా చేసేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కీలక చర్యల చేపడుతోంది. కేబీఆర్ పార్క్ చుట్టూ ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపేందుకు జీహెచ్ఎంసీ కీలక నిర్ణయం తీసుకుంది. 2లో..

# జల్ జీవన్ మిషన్ 2.0 పనులు ప్రారంభం

## - సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ చేతుల మీదుగా శ్రీకారం

### - రూ. 30,156 కోట్లతో రాష్ట్రవ్యాప్త తాగునీటి పథకం - 27 లక్షల గ్రామీణ కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు లక్ష్యం

### - గండికోట నుంచి చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలకు నీరు



అమరావతి (ప్రశ్న న్యూస్) గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికను రూపొందించింది. 'జల్ జీవన్ మిషన్ 2.0 – అమరజీవి జలధార' కార్యక్రాన్ని వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కింద ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ద్వారా సురక్షితమైన తాగునీరు అందించే కార్యక్రమానికి కూటమి నేతలు శ్రీకారం చుట్టారు. వైఎస్సార్ కడప జిల్లాకు చంద్రబాబు, పవన్ కళ్యాణ్, ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ రావడంతో టీడీపీ, జనసేన, బీజేపీ నేతల్లో నూతనోత్సాహం కనిపించింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి నారాయణ, 2లో..

## అర్హులైన ప్రతీ ఒక్కరికీ

# ఇళ్లు ఇవ్వాల్సిందే

### - అధికారులకు సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు



అమరావతి (ప్రశ్న న్యూస్) ప్రజలకు అందించే ప్రభుత్వ సేవల్లో నాణ్యత పెరగాలంటే ఉద్యోగుల సామర్థ్యాన్ని నిరంతరం పెంచుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు కొత్త విషయాలను నేర్చుకుంటూ తమ నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలని సూచించారు. కెపాసిటీ బిల్డింగ్ కమిషన్, మిషన్ కర్మయోగి పోర్టల్, ఉన్నతి ద్వారా అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఆన్‌లైన్‌తో పాటు ఐఐఎంలు, ఐఐటీలు, విశ్వవిద్యాలయాలు తదితర సంస్థల్లో ఆఫ్‌లైన్ శిక్షణ కూడా పొందాలన్నారు. అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో ఆర్టీజీఎస్ సమీక్షలో భాగంగా వివిధ శాఖలు అందిస్తున్న పౌర సేవలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం సమావేశం నిర్వహించారు 2లో..

# ఇందిరమ్మ టవర్స్ లబ్ధిదారులకు అలర్ట్

## - అక్టోబర్ 9 లోగా డిపాజిట్ చెల్లించకపోతే ఇల్లు రద్దు!



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు హౌసింగ్ బోర్డు కీలక ప్రకటన చేసింది. హైదరాబాద్ క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ) పరిధిలో ఇందిరమ్మ టవర్స్ ఫ్లాట్లు పొందేందుకు తాత్కాలిక కేటాయింపు పత్రాలు అందుకున్నవారు తమ వాటా కింద తొలి విడతగా రూ.లక్షను అక్టోబర్ 9వ తేదీలోగా చెల్లించాలని స్పష్టం చేసింది. నిర్ణీత గడువులోగా డబ్బులు చెల్లించని వారి కేటాయింపులు రద్దయ్యే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.

**చెల్లింపుల వివరాలు**

హైదరాబాద్ మహానగరంలోని క్యూర్ పరిధిలో 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ పథకం అమలవుతోంది. లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి అర్హతలను పరిశీలించిన అనంతరం, తెలంగాణ హౌసింగ్ బోర్డు 2లో..

# యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు డెడ్‌లైన్

## - డిసెంబర్ 2027 నాటికి పూర్తి కావాలని సీఎం రేవంత్ ఆదేశాలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను దశలవారీగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. డిసెంబర్ 2027 నాటికి 67 పాఠశాలలను పూర్తి చేయడంతో పాటు, జూన్ 2028 నాటికి ఈ సంఖ్యను 87కు పెంచేలా పనులను వేగవంతం చేసింది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు సైతం జారీ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం, విద్యా మౌలిక వసతుల అభివృద్ధి, ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ స్థాయి ఉన్నత విద్యా సంస్థల ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సీనియర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి పాఠశాలను సుమారు 26 ఎకరాల విస్తీర్ణంలో అన్ని ఆధునిక సదుపాయాలతో నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. అవసరమైన క్రీడా మైదానాలు, వసతి గృహాలు, సిబ్బంది క్వార్టర్లు, ఆధునిక వంటశాలలు, డిజిటల్ తరగతి గదులు తదితర మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నిర్దేశిత గడువుల్లో నాణ్యతా ప్రమాణాలతో పనులను పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. ఈ స్కూళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ పాఠశాలలు ఒకే క్యాంపస్ లో ఉండే విధంగా నిర్మాణాలు చేపట్టారు. దేశంలో ఆదర్శవంతంగా ఉండే విధంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ఏర్పాటు చేస్తున్నారు. 2లో..

## రాయలసీమ పౌరుషమంటే

# గొడ్డలి పోట్లు కాదు.. అభివృద్ధి

### - గత ప్రభుత్వం జలజీవన్ మిషన్ నిధులను నిర్వీర్యం చేసింది



**అమరావతి (ప్రశ్న న్యూస్)** "యుద్ధం వచ్చినప్పుడు, హద్దులు దాటినప్పుడు నా గొంతు ఎలా ఉంటుందో మీకు తెలుసు. కానీ ఇది శాంతి సమయం. ప్రజలకు అభివృద్ధి చేయాల్సిన సమయం. అందుకే రాయలసీమ పౌరుషానికి తగిన స్పీచ్ మాట్లాడట్లేదు. రాయలసీమ అభివృద్ధికి అవసరమైన విధంగా మాట్లాడుతున్నా. గొడవలు, కొట్లాటలు, గొడ్డలి పోట్లు కాకుండా అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్దాం" అంటూ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాయలసీమ పౌరుషాన్ని ప్రస్తావిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గొడవలకు, పౌరుషానికి ప్రతీకగా నిలిచిన ఈ నేల రూపురేఖలను అభివృద్ధి పథంలో మార్చాలని ఆయన పిలుపునిచ్చారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి రూ.30,156 కోట్ల విలువైన 'అమరజీవి జలధార' పథకానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పవన్ కళ్యాణ్ తనదైన శైలిలో ప్రసంగించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు మీద ఈ బృహత్తర తాగునీటి పథకాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని పవన్ అన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 3.27 కోట్ల మంది ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో 24,601 ఆవాసాల్లో 50,315 పనులను ఈ పథకం కింద చేపట్టనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన 'హర్ ఘర్ జల్ – జలజీవన్ మిషన్'కు 2019–24 మధ్య అధికారంలో ఉన్న ప్రభుత్వం తూట్లు పొడిచింది. రూ.26,000 కోట్ల విలువైన పనులకు ప్రతిపాదనలు 2లో..

# బకాయిల సుడిగుండంలో తెలంగాణ

జటిలంగా మారింది. ఆగస్టు 2026 నాటికి ఉద్యోగులు, రిటైర్డ్ సిబ్బందికి చెల్లించాల్సిన మొత్తం బకాయిలు రూ. 14,000 కోట్లకు చేరుకున్నాయి. విధుల్లో ఉన్న సిబ్బందికి చెందిన డీఏ బకాయిలు, సరెండర్ లీవ్ గ్రాంట్లు రూ. 6,200 కోట్ల మేర పేరుకుపోగా, రిటైర్డ్ ఉద్యోగుల జీపీఎఫ్ , పెన్షన్ ప్రయోజనాల బకాయిలు ఏకంగా రూ. 8,000 కోట్లు దాటాయి. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 4,575 కోట్ల బకాయిలను విడుదల చేసినట్లు చెబుతున్నప్పటికీ, ఈ ఒక్క ఏడాదిలోనే సుమారు 9,000 మంది ఉద్యోగులు విధి నిర్వహణ నుంచి పదవీ విరమణ పొందడంతో గ్రాట్యుటీ, పెన్షన్ ఎన్‌క్యాష్‌మెంట్ భారం కొత్తగా వచ్చి చేరింది.

### పెరుగుతున్న ఖర్చులు

మరోవైపు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ మరియు తాత్కాలిక ప్రాతిపదికన సేవలందిస్తున్న ఉద్యోగులకు అందాల్సిన వేతనాల్లో కూడా రూ. 2,000 కోట్ల మేర బకాయిలు ఉండటం క్షేత్రస్థాయి పాలనపై ప్రభావం చూపుతోంది. దీంతో పాటు జులై 2023 నుంచి పెండింగ్‌లో ఉన్న 6 కరువు భత్యం వాయిదాలలో ప్రభుత్వం ఇటీవల 2 వాయిదాలకు ఆమోదం తెలిపినప్పటికీ, ఇంకా మరో 4 డీఏ వాయిదాలు బకాయిల రూపంలోనే వేచి చూస్తున్నాయి. రాష్ట్ర బడ్జెట్‌లో పెన్షన్లు, జీతాల వ్యయం విపరీతంగా పెరగడమే ఈ సంక్షోభానికి ప్రధాన కారణం. 2023-24 నాటికి రాష్ట్ర మొత్తం బడ్జెట్‌లో జీతాలు, పెన్షన్ల వాటా 17.81 శాతంగా ఉండగా, 2026-27 ఆర్థిక సంవత్సరానికి అది 19.47 శాతానికి పెరిగింది. పన్నుల ఆదాయం, కేంద్ర నిధుల రాక అంచనాల కంటే తగ్గడం, దానికి తోడు రుణాల అసలు, వడ్డీ చెల్లింపులు గరిష్ఠ స్థాయికి చేరడం వల్ల ఖజానాపై విపరీతమైన ఒత్తిడి పెరుగుతోంది. మూలధన వ్యయానికి నిధులు సరిపోక పాత అప్పులు తీర్చడానికే కొత్తగా రుణాలు సేకరించాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతోంది.ఒకవైపు సంక్షేమ పథకాల అమలు, మరోవైపు పేరుకుపోయిన రూ. 65,000 కోట్లకు పైగా సర్వీస్, డెవలప్‌మెంట్ బకాయిలను సమతుల్యం చేసుకోవడం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అత్యంత సంక్లిష్టమైన సవాలుగా మారింది. పన్నుయేతర ఆదాయాన్ని పెంచుకోవడం, ప్రాధాన్యతా ప్రాజెక్టులను సవరిస్తూ క్రమశిక్షణతో కూడిన ఆర్థిక నిర్వహణను పాటించకపోతే.. ఈ బకాయిల సుడిగుండం రాష్ట్ర యంత్రాంగాన్ని మరింత ప్రతిష్టంభనలోకి నెట్టే ప్రమాదం ఉందని ఆర్థిక విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# కేంద్రం, ఈసీకి సుప్రీం నోటీసులు

ప్రశ్నలు గుప్పించారు.

### ఫామ్ 6పై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

“సవరించిన ఫారమ్-6 కి మేము ఎలాంటి ఆమోదం తెలపలేదు, ఈ విషయంలో స్పష్టత అవసరం కోర్టు ముందు రికార్డులను సమర్పించినప్పుడు ఆ మార్పులు ఎవరు చేశారో మేము పరిశీలిస్తాం కానీ, మీ పిటిషన్లలోని విజ్ఞప్తులు కాస్త గందరగోళంగా ఉన్నాయి” అని సీజేఐ వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. పిటిషనర్ల ఆరోపణలపై సమాధానం ఇస్తూ కౌంటర్ దాఖలు చేయాలని అత్యున్నత న్యాయస్థానం ప్రతివాదులను ఆదేశించింది. చట్టబద్ధమైన నిబంధనలను పాటించారో? లేదో? తాము పరిశీలిస్తామని, ఒకవేళ చట్టవిరుద్ధంగా ఏవైనా నిర్ణయాలు తీసుకున్నట్లు తేలితే వాటిని రద్దు చేయడంతో పాటు చెల్లకుండా (అల్ట్రా వైర్స్) చేస్తామని కోర్టు స్పష్టం చేసింది. “ఏదైనా నిర్ణయం ఏకగ్రీవంగా తీసుకోలేదని రికార్డులు చెబితే, మేము ఆ నిర్ణయాలను నిలిపివేసి, అవి చట్టవిరుద్ధమని ప్రకటిస్తాం. అయితే, అన్ని నిర్ణయాలూ ఏకపక్షంగానే తీసుకున్నారని ముందస్తుగా ఒక ముగింపునకు రాగలమా? వారు దీనిపై స్పష్టమైన, పారదర్శకమైన రీతిలో స్పందిస్తారని ఆశిస్తున్నాం” అని జస్టిస్ బాగ్చీ వ్యాఖ్యానించారు.

### పిటిషనర్లు ఏం కోరారు?

ఎన్నికల కమిషన్ విశ్వసనీయతను కాపాడేందుకు తుది విచారణ పూర్తయ్యే వరకు జ్ఞానేష్ కుమార్‌ను సస్పెండ్ చేయాలని ఒక పిటిషనర్ కోరారు. అంతవరకు సంధూ, జోషి కలసి ఎన్నికల సంఘం బాధ్యతలను నిర్వహించాలని, ఏదైనా ఖాళీ ఏర్పడితే భారత ప్రధాన న్యాయమూర్తి ఉన్న కమిటీ సిఫార్సు ఆధారంగా భర్తీ చేయాలని విజ్ఞప్తి చేసింది. కాగా, విధి నిర్వహణలో విఫలమైనందుకు సీఈసీ, ఇతర అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రెండో పిటిషనర్ విజ్ఞప్తి చేశారు. ఏకాభ్రియం ఆమోదం లేకుండా జ్ఞానేష్ కుమార్ ఆధ్వర్యంలో తీసుకున్న నిర్ణయాలు, మార్గదర్శకాలు, సాఫ్ట్‌వేర్ మార్పులన్నీ “రాజ్యాంగ విరుద్ధం, చట్టవిరుద్ధం, మొదటి నుంచీ చెల్లవు” అని ప్రకటించాలని పిటిషనర్ అభ్యర్థించారు. కమిషనర్ల మధ్య అభిప్రాయభేదాలు వచ్చినప్పుడు మెజారిటీ నిర్ణయమే చెల్లుబాటు అవుతుందని చెప్పే ‘చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర ఎలక్షన్ కమిషనర్ల చట్టం, 2023’ లోని సెక్షన్ 18ని త్రిపాఠి పిటిషన్ ఉటంకించింది. ఈ చట్టం ప్రకారం నిర్ణయాలన్నీ కలిసే తీసుకోవాల్సి ఉంటుందని పిటిషనర్ వాదించారు.

### ఎస్ఐఆర్ వివాదం

ఇటీవల ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రచురించిన నివేదిక ప్రకారం గడిచిన 10 నెలల్లో ఎస్ఐఆర్ (సర్) కి సంబంధించి తమకు తెలియకుండా లేదా తమ సిఫార్సు లేకుండా జారీ చేసిన కనీసం 14 నిర్ణయాలు, ఉత్తర్వులపై కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషిలు అభ్యంతరాలను వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

# ఎన్నికలపై నమ్మకం లేకుంటే రాజీనామా చేయాలి

పనితీరును, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించే విధానాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారని గుర్తుచేశారు. యావత్ ప్రపంచం భారత ఎన్నికల ప్రక్రియను చూసి గర్విస్తుంటే కాంగ్రెస్ పార్టీ నేతలు మాత్రం ఎన్నికల సంఘంపై అవాకులు చవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. ఒక చాయ్‌వాలా (నరేంద్ర మోదీ) దేశానికి ప్రధాని కావడాన్ని కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతోందని విమర్శించారు. దేశంలో జరిగిన ఎన్నికలన్నీ చెల్లవంటూ మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. అదే నిజమని భావిస్తే తెలంగాణలో అక్రమంగా గెలిచిన రేవంత్ రెడ్డితో, అలాగే కేరళ, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రుల చేత మొదట రాజీనామాలు చేయించాలని రామచందర్ రావు సవాల్ విసిరారు.

### మహేశ్వరంలోనే 30 వేల మంది రోహింగ్యాలు

కాంగ్రెస్ హయాంలో విదేశాల నుంచి భారత్‌లోకి అక్రమంగా వచ్చిన చొరబాటుదారులు ఓటర్ల జాబితాలో చేరారని, ప్రస్తుతం ఎస్ఐఆర్ (సర్) ప్రక్రియలో కోట్లాది మంది అక్రమ ఓటర్ల పేర్లు బయట పడుతున్నారని ఆయన తెలిపారు.

మహేశ్వరం నియోజకవర్గంలోనే సుమారు 30 వేల మంది రోహింగ్యాలు, అక్రమ ఓటర్లు ఉన్నట్లు తేలిందన్నారు. చొరబాటుదారుల ఓట్లను తొలగిస్తుంటే ఓడిపోతామనే భయంతోనే కాంగ్రెస్, ‘ఇండి’ కూటమి నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. 18 ఏళ్లు పైబడిన ప్రతి భారత పౌరుడికీ ఓటు హక్కు ఉండాలన్నారు.

### హామీలు నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వం

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడేళ్లవుతున్నా 6 గ్యారెంటీలు సహా ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని రామచందర్ రావు ఆరోపించారు.

రైతులు, విద్యార్థులు, ఉద్యోగుల సమస్యలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. గత బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబం ఒక్కటే బాగుపడితే, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో రేవంత్ రెడ్డి అండ్ బ్రదర్స్ దోచుకుంటున్నారని, వీరికి ప్రత్యామ్నాయంగా తెలంగాణను రక్షించే సత్తా ఒక్క బీజేపీకి మాత్రమే ఉందన్నారు.

### ఆలయాలపై దాడుల వెనుక కుట్ర

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో హిందువులకు, హిందూ సాంస్కృతిక విలువలపై అన్యాయం జరుగుతోందని ఎన్. రాంచందర్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే సీఎం రేవంత్ రెడ్డి కోట్లాది మంది భక్తుల మనోభావాలను గాయపరుస్తున్నారని, హిందూ దేవీదేవతలను, ఆచారాలను కించపరిచేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ గుడి ఘటన నుంచి ఇటీవల మల్కాజిగిరి, దిల్‌సుఖ్‌నగర్ సంతోషిమాత ఆలయాల దాడుల వరకు వరుసగా హిందూ దేవాలయాలపై ఇలా జరగడంలో కుట్ర దాగి ఉందన్నారు. దాడి జరిగిన ప్రతిసారీ పోలీసులు ఎంట్రీ ఇచ్చి నిందితుడికి మతిస్థిమితం లేదంటూ సును పక్కదారి పట్టించడం అలవాటుగా మారిందన్నారు.
మజ్లిస్ పార్టీతో చేతులు కలిపిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే ఇలాంటి పనులను ప్రోత్సహిస్తున్నాయని, ప్రజల ఆత్మగౌరవంగా బతకాలంటే బీజేపీ అధికారంలోకి రావడం ఒక్కటే మార్గమని స్పష్టం చేశారు.అలాగే, బీజేపీ కేవలం ఎన్నికల రాజకీయాలకే పరిమితం కాకుండా నిరంతరం ప్రజలకు సేవ చేసే సైన్యమని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ‘సేవా సంకల్ప్ అభియాన్’ కింద అక్టోబర్ 7వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లా కేంద్రంలో సేవా జ్యోతి యాత్ర, ‘వికసిత్ భారత్ సంకల్ప సభ’ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ వర్చువల్ విధానంలో ఈ కార్యక్రమాల్లో పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారని తెలిపారు.

# కేబీఆర్ పార్క్ చుట్టూ ఇక శాశ్వతంగా వన్‌వే

ఈ పార్క్ పరిసరాల్లో ప్రస్తుతం అమలు చేస్తున్న వన్‌వే విధానాన్ని శాశ్వతంగా కొనసాగించాలని కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ విధానం వల్ల ట్రాఫిక్ రద్దీ తగ్గిన నేపథ్యంలో గతంలో ప్రతిపాదించిన భారీ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల ప్రణాళికను అధికారులు పునఃపరిశీలించారు. కొత్త ప్రణాళికతో ప్రభుత్వానికి సుమారు రూ.400 కోట్లు ఆదా అయ్యే అవకాశం ఉందని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తాజాగా వెల్లడించారు.దకేబీఆర్ పార్క్ చుట్టూ సింగిల్ వే, ఫ్రీ లెఫ్ట్ విధానాన్ని అమలు చేయడం మంచి ఫలితాలను ఇచ్చిందని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు. దీంతో ఈ విధానాన్ని తాత్కాలిక ప్రయోగంగా కాకుండా శాశ్వతంగా కొనసాగించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు అవసరమైన చోట మాత్రమే ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించేలా ప్రణాళికలో మార్పులు చేస్తున్నట్లు వివరించారు. గతంలో కేబీఆర్ పార్క్ పరిసరాల్లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు 7 స్టీల్ బ్రిడ్జిలు, 7 అండర్‌పాస్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.1,090 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. అయితే వన్‌వే విధానం అమలుతో పరిస్థితిలో మార్పు రావడంతో పాత ప్రణాళికను రద్దు చేసి కొత్త ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించారు.కొత్త ప్రతిపాదనలో భాగంగా బంజారాహిల్స్‌లోని ముఫఖం జా కాలేజ్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర 6 లేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.751 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. పాత ప్రణాళికతో పోలిస్తే కొత్త ప్రతిపాదనలో వ్యయం తగ్గడంతో పాటు భూసేకరణ ఖర్చు కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. పాత ప్రణాళికలో భూసేకరణకే సుమారు రూ.1,040 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా వేయగా కొత్త ప్రతిపాదనలో ఈ ఖర్చు రూ.300 కోట్లలోపే ఉండవచ్చని పేర్కొంటున్నారు. ఇప్పటికే పార్క్ హయత్, కేబీఆర్ పార్క్ మెయిన్ గేట్ సమీపంలో నిర్మించిన పిల్లర్లను కొత్త ఎలివేటెడ్ కారిడార్‌లో వినియోగించే అవకాశాలను కూడా పరిశీలిస్తున్నారు. పాత పనుల్లో నిర్మించిన నిర్మాణాలను సాధ్యమైనంతవరకు తిరిగి ఉపయోగించుకోవడం ద్వారా ఖర్చు తగ్గించాలన్నది అధికారుల ఉద్దేశంగా కనిపిస్తోంది.పాత ప్రణాళికలో భాగంగా అగ్రసేన్ మహారాజ్ జంక్షన్ వద్ద అండర్‌పాస్‌ల నిర్మాణం కోసం తవ్విన 2 భారీ గుంతలను ప్రస్తుతం పూడ్చివేస్తున్నారు. ట్రాక్టర్లు, ట్రక్కుల ద్వారా మట్టిని తరలించి గుంతలను నింపుతున్నారు. ఆ తర్వాత ఆ ప్రాంతాన్ని రోడ్డుకు సమాంతరంగా అభివృద్ధి చేయనున్నారు. ఇతర ప్రాంతాల్లో అండర్‌పాస్‌ల కోసం తవ్విన గుంతలను కూడా దశలవారీగా పూడ్చే చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. జూబ్లీ చెక్‌పోస్ట్ నుంచి నాగార్జున సర్కిల్ వరకు స్టీల్ ఫ్లైఓవర్ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ వెల్లడించారు. ఈ పనులను ఏడాదిలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్పష్టం చేశారు. కొన్ని కోర్టు కేసుల కారణంగా కూడా ప్రాజెక్టు ప్రణాళికలో మార్పులు చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. మొత్తంగా కేబీఆర్ పార్క్ పరిసరాల్లో ట్రాఫిక్ నియంత్రణకు వన్‌వే విధానాన్ని కొనసాగిస్తూనే అవసరమైన చోట ఎలివేటెడ్ కారిడార్లు, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం చేపట్టాలని జీహెచ్ఎంసీ భావిస్తోంది. అయితే కొత్త ప్రణాళికకు సంబంధించిన తుది రూపకల్పన, నిర్మాణాల అమలు, పూర్తి గడువు వంటి వివరాలు అధికారిక ప్రకటనల ఆధారంగా మరింత స్పష్టత రావాల్సి ఉంది.

# జల్ జీవన్ మిషన్ 2.0 పనులు ప్రారంభం

రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, నంద్యాల ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రూ.30,156 కోట్ల ప్రాజెక్టు.. 27 లక్షల కుటుంబాలకు తాగునీరు

రూ.30,156 కోట్ల భారీ అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ జల్ జీవన్ మిషన్ పనులను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రొద్దుటూరు నుంచి సోమవారం ఉదయం ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 27 లక్షల గ్రామీణ కుటుంబాలకు కొత్తగా తాగునీటి కుళాయి కనెక్షన్లు లభించనున్నాయి. పర్యటనలో భాగంగా ప్రొద్దుటూరు మండలంలోని కొత్తపల్లి గ్రామంలో పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం, అక్కడే ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. రూ.30 వేల అంచనా వ్యయంతో రాష్ట్రవ్యాప్తంగా 50,315 పనులు చేపట్టడం ఈ పథకం లక్ష్యం కాగా, వీటిల్లో ఇప్పటికే 27,301 పనులు పూర్తికాగా రూ.5,587 కోట్లు ఖర్చు చేసింది కూటమి ప్రభుత్వం.

### 3.27 కోట్ల మంది ప్రజలకు ప్రయోజనం

‘హర్ ఘర్ జల్’ లక్ష్యంలో భాగంగా ఏపీ ప్రభుత్వం 24,601 ఆవాసాల్లోని 27.36 లక్షల కుటుంబాలకు కొత్త నల్లా కలెక్షన్లు ఇస్తుంది. తద్వారా సుమారు 3.27 కోట్ల మంది గ్రామీణ ప్రాంతాల ప్రజలకు తాగునీరు అందుతుంది. గ్రామాల్లోని ప్రతి కుటుంబానికి రోజుకు సగటున 55 లీటర్ల మంచినీరు అందించనున్నారు. హిరమండలం, పీఏబీఆర్, వెలుగోడు-ఓంకారం, ఏలేరు, గండికోట, ధవళేశ్వరం, తాండవ వంటి ప్రధాన జలాశయాలు, నీటి వనరుల నుంచి నీటిని సేకరించి గ్రామీణ ప్రాంతాలకు సరఫరా చేసేలా కూటమి సర్కార్ సరికొత్త వ్యవస్థను రూపొందించింది. మరోవైపు అమరజీవి జలధార కార్యక్రమంలో భాగంగా 1,426 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నీటి శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. 14,995 నీటి నిల్వ నిర్మాణాలు, 77,243 కి.మీ. పైప్‌లైన్లు నిర్మించడంతో కొండ ప్రాంతాలు, నీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లోనూ ఇంటింటికీ కుళాయి ద్వారా నీటిని అందిస్తారు.

### కూటమి అధికారంలోకి వచ్చాక మళ్లీ పట్టాలెక్కిన ప్రాజెక్టు..

గత ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు తాగునీరు అందించే జలజీవన్ మిషన్ పథకాన్ని నిర్వీర్యం చేసిందని, కేవలం రూ.2,600 కోట్లే ఖర్చు చేసిందని కూటమి నేతలు విమర్శించారు. 2019లో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టగా పలు రాష్ట్రాలు పోటీ పడి మరీ నిధులు తెచ్చుకోగా, జగన్ హయాంలో తక్కువగా ఖర్చు చేశారని ఆరోపించారు. 2024లో చంద్రబాబు నేతృత్వంలో కూటమి అధికారంలోకి వచ్చాక కేంద్రంతో చర్చి రాష్ట్రానికి భారీగా నిధులు తెచ్చామని అధికార పార్టీల నేతలు చెబుతున్నారు.

# ఇందిరమ్మ టవర్స్ లబ్ధిదారులకు అలర్ట్



ఇప్పటివరకు మొత్తం 5,501 మందికి అలాట్‌మెంట్ లెటర్లు జారీ చేసింది. అయితే వీరిలో కేవలం 3,271 మంది (సుమారు 59.46%) మాత్రమే తొలి విడతగా రూ.లక్ష చెల్లించారు. మిగిలినవారు గడువులోగా తమ వాటాను చెల్లించాలని హౌసింగ్ బోర్డు కోరింది.గడువులోగా చెల్లింపులు చేయని వారి తాత్కాలిక కేటాయింపులను రద్దు చేసి, ఆ ఫ్లాట్లను వెయిటింగ్ లిస్టులో ఉన్న ఇతర అర్హులకు కేటాయించే అవకాశం ఉందని తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్, హౌసింగ్ కమిషనర్ వీపీ గౌతమ్ తెలిపారు. ప్రస్తుతం కేటాయింపు పత్రాలు రాని సుమారు 35 వేల మంది అర్హులైన దరఖాస్తుదారులు వెయిటింగ్ లిస్టులో ఉన్నారు.

### లబ్ధిదారులకు ముఖ్యమైన అంశాలు

కేటాయింపు డాక్యుమెంట్‌లో పేర్కొన్న వర్చువల్ అకౌంట్ నెంబర్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌లను సరిచూసుకొని నెట్ బ్యాంకింగ్ లేదా ఇతర డిజిటల్ మార్గాల ద్వారా డబ్బులు చెల్లించాలి. అకౌంట్ నంబర్‌లోని సున్నా (0), ఇంగ్లీష్ అక్షరం ‘ఒ’ మధ్య తేడాను పరిశీలించి పేమెంట్ ఫెయిల్ కాకుండా జాగ్రత్తపడాలని సూచించింది. లాటరీలో పేరు వచ్చినంత మాత్రాన తుది కేటాయింపు ఖరారైనట్లు కాదని, లబ్ధిదారుల నివాస అర్హత, ఆదాయ పరిమితి, కుటుంబానికి ఇప్పటికే ఇల్లు ఉందా లేదా అనే అంశాలను అధికారులు పరిశీలిస్తారు. ఏవైనా సందేహాలుంటే తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ లేదా బోర్డు కాల్ సెంటర్ నంబర్ 040-24603572ను సంప్రదించవచ్చు.

# అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇళ్లు ఇవ్వాల్సిందే

. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్య పెంపునకు ఐగాట్ మిషన్ కర్మయోగి ఆన్‌లైన్ కోర్సులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని సీఎం తెలిపారు. ఓ సెకండరీ గ్రేడ్ టీచర్ ఏకంగా 4,200 కోర్సులు పూర్తి చేసి తన సామర్థ్యాన్ని పెంచుకున్న విషయాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. ఉద్యోగులు తమ విధులకు సంబంధించిన అంశాలతో పాటు ఆధునిక సాంకేతికత, పరిపాలన, ప్రజాసేవకు సంబంధించిన కోర్సులను అభ్యసించాలని సూచించారు. సానుకూల ప్రజాభిప్రాయాన్ని పెంచుకోవడంలో వెనుకబడిన శాఖలు, విభాగాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని చెప్పారు. సామర్థ్య పెంపుతో పాటు ప్రజల్లో ప్రభుత్వంపై సానుకూల అభిప్రాయం పెరిగేలా శాఖలు కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. త్వరలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తానని సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు.

### గుంతల పూడ్చివేతకు ఆధునిక సాంకేతికత

రహదారులపై గుంతల పూడ్చివేతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. గుంతలు పూడ్చడంతో పాటు రహదారుల నిర్వహణపై నిరంతరం దృష్టి పెట్టాలని సూచించారు. బిటుమిన్ లభ్యత, ఫ్లైయాష్ అందుబాటులో ఉన్న పరిమాణంపై అధికారులను ఆరా తీశారు. ఆర్టీసీ బస్సులు నిర్ణీత సమయానికి గమ్య స్థానాలకు చేరేలా షెడ్యూలింగ్, టైమ్ మేనేజ్‌మెంట్ పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం చేపట్టిన మూడు లక్షల ఇళ్ల నిర్మాణంతో పాటు మరో ఆరు లక్షల ఇళ్ల నిర్మాణానికి కార్యాచరణ రూపొందించాలని సీఎం సూచించారు. వచ్చే రెండున్నర ఏళ్లలో నిర్దేశించుకున్న గృహ నిర్మాణ లక్ష్యాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సి ఉందని, దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను త్వరగా గుర్తించాలని చెప్పారు. ఎక్కడా డూప్లికేషన్ లేకుండా వన్ ఫ్యామిలీ వన్ హౌస్ విధానంలో అర్హులకు వేగంగా ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

### సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు లక్ష్యాన్ని చేరుకోవాలి

జల్ జీవన్ మిషన్ ద్వారా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించే లక్ష్యాన్ని రెండేళ్లలో పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో చేపడుతున్న మౌలిక సదుపాయాల కల్పన పనులను కూడా వేగవంతం చేయాలని సూచించారు. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో మొబైల్ కనెక్టివిటీ పెంచేందుకు అవసరమైన ప్రాంతాల్లో సెల్ టవర్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పీఎం సూర్యఘర్ పథకం కింద ఇళ్లపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇప్పటికే 4.1 లక్షల కనెక్షన్లతో దేశంలో నాలుగో స్థానంలో ఉన్నామని అధికారులు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలపైనా సౌర విద్యుత్ ఫలకాల ఏర్పాటుతో 200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఆస్కారం ఉందని వివరించారు. కుప్పం నియోజకవర్గంలో మొత్తం ప్రాంతాన్ని ఇళ్లపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల ఇళ్లకు సోలార్ కనెక్షన్లు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

### పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ

రాష్ట్రంలో రానున్న పెట్టుబడులకు అనుగుణంగా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను రూపొందించాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్యాలు అందించాలని చెప్పారు. పీఎం సేతు--ఆర్సెలార్ మిట్టల్ స్కిల్ సెంటర్ ద్వారా మెరుగైన శిక్షణ అందించాలని, ఐటీఐలు, పాలిటెక్నిక్ కళాశాలలను పరిశ్రమలతో అనుసంధానించి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఉద్యోగ అవకాశాల కల్పన నిరంతర ప్రక్రియగా ఉండాలని, యువతకు ఆన్‌లైన్ కోర్సుల ద్వారా కూడా నైపుణ్యాలు పెంపొందించాలని సూచించారు. నైపుణ్య పోర్టల్‌ను ఇతర వ్యవస్థలతో సమగ్రంగా అనుసంధానం చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ సమీక్షకు రెవెన్యూ, ఆర్థిక, ఐటీ, మహిళా శిశుసంక్షేమం, సెర్ప్, రవాణా, దేవాదాయ, అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.
రాయలసీమ పౌరుషమంటే

# గొడ్డలి పోట్లు కాదు.. అభివృద్ధి

పంపి, ఐదేళ్లలో కేవలం రూ.2,700 కోట్లు మాత్రమే ఖర్చు చేసి ఏ ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదు. ప్రజల తాగునీటి కష్టాలను ఏమాత్రం పట్టించుకోలేదు” అని దుయ్యబట్టారు.2024లో ఈ పథకం ముగిసిపోవాల్సిన తరుణంలో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాను, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు సి.ఆర్. పాటిల్, నిర్మలా సీతారామన్‌లను కలిసి విజ్ఞప్తి చేశామని గుర్తుచేశారు. వారి సహకారంతో ఈ పథకాన్ని 2028 వరకు పొడిగించుకుని, పనులను వేగవంతం చేశామని తెలిపారు. “గత ప్రభుత్వం ఖర్చు చేయగా మిగిలిన పనులతో పాటు, ఇప్పటికే మేము రూ.4,500 కోట్ల విలువైన పనులను పూర్తి చేశాం. మీరు మాపై ఉంచిన నమ్మకమే మాకు శ్రీరామరక్ష” అని పవన్ పేర్కొన్నారు.తమది కక్షసాధింపుల ప్రభుత్వం కాదని, ప్రజాభివృద్ధిని మాత్రమే లక్ష్యంగా పెట్టుకుందని పవన్ స్పష్టం చేశారు. “దశాబ్దాలుగా తాగునీటి సమస్యతో అల్లాడుతున్న పులివెందుల నియోజకవర్గంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పథకాలకు రూ.280 కోట్లు కేటాయించి 7 మండలాల్లోని 299 గ్రామాలకు నీరందిస్తున్నాం.

అలాగే, వైసీపీ ఎంపీ ఉన్నప్పటికీ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు, పాడేరు నియోజకవర్గాల్లో రూ.2,500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. మాకు పార్టీలు కాదు, ప్రజల సమస్యలే ముఖ్యం” అని ఉద్ఘాటించారు.గత ప్రభుత్వ హయాంలో తమ పార్టీకి మద్దతిచ్చారనే కారణంతో ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని తాళ్లమాపురం గ్రామ ప్రజలను నాటి శాసనసభ్యుడు తీవ్రంగా అవమానించారని, వారి వినతిపత్రాన్ని కళ్లెదుటే నలిపి పడేశారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గ్రామాల అభివృద్ధి కోసం తక్షణమే రూ.3.5 కోట్లతో సీసీ రోడ్లు, తాగునీటి పథకాలను మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి సమక్షంలో ప్రకటించారు.

రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా మౌలిక వసతులను కల్పిస్తున్నామని గణాంకాలతో వివరించారు. “రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి 2024 వరకు నిర్మించిన వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లు, రిజర్వాయర్ల సామర్థ్యానికి అదనంగా 50 శాతం నుంచి 175 శాతం వరకు కేవలం ఈ ఐదేళ్లలోనే నిర్మించబోతున్నాం” అని తెలిపారు. నీటిని అందించడం ప్రభుత్వ బాధ్యత అయితే, దాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు డెడ్‌లైన్

### ఫ్యూచర్ సిటీలో విదేశీ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లు

తెలంగాణ రాష్ట్రంను అంతర్జాతీయ విద్యా కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా ఫ్యూచర్ సిటీలో ప్రముఖ విదేశీ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. లండన్ యూనివర్సిటీ వంటి ప్రముఖ అంతర్జాతీయ విద్యా సంస్థలను తెలంగాణకు ఆకర్షించేలా సమగ్ర విధానాన్ని రూపొందించాలని అధికారులకు సూచించారు.

ఇప్పటి వరకు లండన్ విశ్వవిద్యాలయం, బర్మింగ్‌హామ్ విశ్వవిద్యాలయంతో పాటు మరో 4 అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు ఫ్యూచర్ సిటీలో తమ బ్రాంచీలు ఏర్పాటు చేసేందుకు సుముఖత వ్యక్తం చేసాయని అధికారులు పేర్కొన్నారు. విదేశీ విశ్వవిద్యాలయాలను ఆహ్వానించడం, క్యాంపస్‌ల ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతులు, పెట్టుబడులు, అనుమతులు, విద్యా కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలను ఈ విధానంలో పొందుపరచాలని సీఎస్ సంజయ్ జాజూ ఆదేశించారు.

### తెలంగాణలో ప్రపంచస్థాయి విద్యా అవకాశాలను అందుబాటులోకి

తెలంగాణలో ప్రపంచస్థాయి విద్యా అవకాశాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాల విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని సీఎస్ సంజయ్ జాజూ పేర్కొన్నారు.
ఫ్యూచర్ సిటీలో ప్రతిపాదిత అంతర్జాతీయ విద్యా సంస్థల ఏర్పాటుకు సంబంధించి ప్రముఖ విదేశీ విశ్వవిద్యాలయాలతో సంప్రదింపులు జరిపి, గ్లోబల్ సమ్మిట్ సమయానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను సీఎస్ సంజయ్ జాజూ ఆదేశించారు.ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేశ్ రంజన్, సబ్యసాచి ఘోష్, ముఖ్య కార్యదర్శులు సందీప్ కుమార్ సుల్తానియా, యోగితా రాణా, రాహుల్ బొజ్జ, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేల ప్రజా సంబంధాల అధికారుల అవగాహన వర్క్‌షాప్‌లో పాల్గొన్న భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి



తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కార్యాలయం ఆధ్వర్యంలో ఈరోజు హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే భవన్ వేదికగా శాసనసభ్యుల వద్ద పనిచేసే పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ల కోసం ఏర్పాటు చేసిన "వన్ డే వర్క్‌షాప్" (ఒక రోజు అవగాహన సదస్సు) లో భువనగిరి పార్లమెంట్ సభ్యులు శ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఎంపీ చామల మాట్లాడుతూప్రజాప్రతినిధులకు మరియు ప్రజలకు మధ్య వారధిగా పనిచేసే పి.ఆర్.ఓల పాత్ర ఎంతో కీలకమైనదని పేర్కొన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలోనూ, సమాచార మార్పిడిని వేగవంతం చేయడంలోనూ మెరుగైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.ప్రజా సమస్యలను త్వరితగతిన ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారంలో క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు మరియు పి.ఆర్.ఓ లు పాల్గొన్నారు.

# రూటు మార్చిన జగన్

- గెలుపు గుర్రాల కే టిక్కెట్లు
- స్థానిక ఎన్నికలలో అభ్యర్థుల ఎంపిక పై వైసీపీ కొత్త వ్యూహం
- మేయర్, మున్సిపల్ చైర్మన్ స్థానాలకు మూడు పేర్లు. సర్వేలు,క్షేత్రస్థాయి నివేదికల ఆధారంగా తుది ఎంపిక.
- జిల్లా అధ్యక్షులకు జగన్ దిశానిర్దేశం



**తాడేపల్లి,** స్థానిక సంస్థల ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభ్యర్థుల ఎంపిక విషయంలో రూటు మార్చినట్లు,పార్టీ వర్గాలలో చర్చ జరుగుతోంది.గతంలో నాయకత్వానికి నచ్చిన వారికి ప్రాధాన్యం ఇచ్చే విధానానికి భిన్నంగా ఈసారి గెలిచే సత్తా ఉన్న అభ్యర్థులకే టిక్కెట్లు ఇవ్వాలని జగన్ భావిస్తున్నట్లు సమాచారంముఖ్యంగా మేయర్, మున్సిపల్ చైర్మన్ వంటి కీలక పదవులకు ముందుగానే ఒక పేరును ఖరారు చేయకుండా.ప్రతి స్థానానికి మూడు పేర్లతో జాబితా సిద్ధం చేయాలని పార్టీ జిల్లాఅధ్యక్షులు,స్థానిక నాయకత్వానికి,సూచించి నట్లు తెలుస్తోంది.ఈ ముగ్గురిలో ఎవరి పట్ల ప్రజలలో ఆదరణ ఉందో ఎవరి సామాజిక సమీకరణాలుఅనుకూలంగా ఉన్నాయో ? పార్టీ కేడర్‌ను ఎవరు సమన్వయంచేయగలరో. అనే అంశాలను పరిశీలించి తుది అభ్యర్థిని ఎంపిక చేసే విధానం ఉండవచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.ఇక సిఫార్సులకే పరిమితం కాకుండా.స్థానిక ఎన్నికలలో అభ్యర్థి వ్యక్తిగత బలం కీలకంగా ఉండ టంతో,కేవలం నాయకుల సిఫార్సులు, పరిచయాలు, వర్గ సమీకరణాల ఆధారంగా కాకుండా సర్వేలు,క్షేత్రస్థాయి సమాచారం, ప్రజాభిప్రాయం ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయాలనే ఆలోచనకు జగన్ వచ్చినట్లు,సమాచారం.ఇటీవల పార్టీ జిల్లా అధ్యక్షులు, రీజినల్ కోఆర్డినేటర్ల,తో నిర్భహించిన సమా వేశాలలో స్థానిక ఎన్నికల సన్నద్ధత పై జగన్ సమీక్ష నిర్వహించారు.బలమైన, విశ్వసనీయమైన అభ్యర్థులను ముందుగానే గుర్తించాలని,స్థానిక నాయకులు కేడర్‌తో విస్తృతంగా చర్చించాలని సూచించినట్లు వైఎస్సార్‌సీపీ అధికారికంగా వెల్లడించిందిమూడు పేర్లు ఒకే తుది ఎంపిక,మేయర్,చైర్మన్ స్థానాలకు మూడు పేర్లను పరిశీలనలో ఉంచి,వాటిలో గెలుపు అవకాశాలు,ప్రజలలో ఉన్న గుర్తింపు,స్థానిక రాజకీయ సమీకరణాలు,కేడర్ బలం తదితర అంశాలను బేరీజు వేసి తుది అభ్యర్థిని ఎంపిక చేసే అవకాశం ఉంది.స్థానిక ఎన్నికలలో టిక్కెట్ కోసం జరిగే లాబీయింగ్,కు బదులుగా "గెలిపించే సత్తా..ఎవరికుంది.అనే ప్రశ్నకు ప్రాధాన్యం లభించే అవకాశం ఉందన్న చర్చ వైఎస్సార్‌సీపీలోమొదలైంది.గత అనుభవాల నేపథ్యంలో వ్యూహ మార్పు. స్థానిక ఎన్నికలలో పార్టీ గుర్తుతో పాటు అభ్యర్థి వ్యక్తిగత,పరిచయాలు,సామాజిక సంబంధాలు,స్థానిక సమస్యల పై అవగాహన,కేడర్‌తో సమన్వయం వంటి అంశాలు ప్రభావం చూపుతాయి.ఈసారి ముందుగానే మూడు పేర్లను గుర్తించి,క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేసి తుది నిర్ణయం తీసుకోవాలని జగన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.ఈ ప్రక్రియ అమలైతే వైఎస్సార్‌సీపీ స్థానిక ఎన్నికల అభ్యర్థుల ఎంపికలో ఒక విధమైన సర్వే ఆధారిత ఎంపిక విధానం కు నాంది పలికినట్లవుతుంది.తుది అభ్యర్థుల ఎంపిక పూర్తయ్యే వరకు పేర్లు,సామాజిక సమీకరణాలు,రిజర్వేషన్లుతదితర అంశాల ఆధారంగా మార్పులు ఉండే అవకాశం ఉంది.మూడు పేర్లను పరిశీలించి చివరకు గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్న అభ్యర్థికే టిక్కెట్, . ఇవ్వాలన్నది ప్రస్తుతం పార్టీ వర్గాలలో వినిపిస్తున్న ప్రధాన వ్యూహంగా కనిపిస్తోంది

## మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన కఠిన చర్యలు..

- జొన్నగిరి ఎస్సై మల్లికార్జున



**తుగ్గలి:**మద్యం సేవించి వాహనాలను నడిపితే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని జొన్నగిరి ఎస్సై ఎన్. సి మల్లికార్జున వాహనదారులను హెచ్చరించారు.ఈ సందర్భంగా సోమవారం రోజున కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు,పత్తికొండ ఎస్డిపిఓ వెంకట్రామయ్య ఆధ్వర్యంలో,రూరల్ సీఐ పెద్దయ్య నాయుడు పర్యవేక్షణలో జొన్నగిరి ఎస్సై మల్లికార్జున గారు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన ఒక ఆటో డ్రైవర్ మరియు నలుగురు ద్విచక్ర వాహనదారులను పట్టుకుని సోమవారం రోజున పత్తికొండ గౌరవ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ముందు హాజరుపరచగా న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున మొత్తం రూ.25,000/- జరిమానా విధించారని ఆయన తెలియజేశారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని,ఇది ప్రాణాలకే ప్రమాదకరమని,రానున్న రోజుల్లో తనిఖీలు మరింత ముమ్మరం చేస్తామని,పట్టుబడిన వారికి భారీ జరిమానాతో పాటు జైలు శిక్ష మరియు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున వాహనదారులను హెచ్చరించారు.

# వివేకా హత్య కేసులో లబ్ధిదారులెవరో తేలింది

- సుపారీపై జగన్ సమాధానం చెప్పాలి






అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, ముఖ్యంగా రాయలసీమ దశ, దిశ మార్చడమే లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. ప్రొద్దుటూరులో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర గ్రామీణాభివృద్ధికి ఇక్కడి నుంచే పొద్దుపొడుపు అవుతుందని అన్నారు. ఈ సభ వేదికగా రూ.30,156 కోట్ల భారీ బడ్జెట్‌తో ప్రతిష్ఠాత్మక 'అమరజీవి జలధార' (జల్ జీవన్ మిషన్ 2.0) పథకానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి శ్రీకారం చుట్టారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 90 లక్షల కుటుంబాలకు ఇంటింటికీ కుళాయి ద్వారా సురక్షితమైన తాగునీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తూ, పలు కీలక అంశాలపై ప్రతిపక్ష నేతకు సవాల్ విసిరారు.

### - గ్రామీణ తాగునీటి కష్టాలకు 'అమరజీవి జలధార'తో చెక్

సభలో చంద్రబాబు మాట్లాడుతూ, "ప్రజల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ఈ రోజు ప్రొద్దుటూరులో ఈ బృహత్కార్యక్రమాన్ని ప్రారంభించాం. తెలుగు జాతి కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు గారి స్ఫూర్తితో ఈ పథకానికి 'అమరజీవి జలధార' అని పేరు పెట్టాం. నీళ్లు తాగిన ప్రతిసారీ ఆయన త్యాగం గుర్తుకురావాలి. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 3 కోట్ల 30 లక్షల మంది ప్రజలకు లబ్ధి చేకూరుతుంది. మహిళల నీటి కష్టాలు తీరడంతో పాటు వారి శ్రమ, సమయం, ఖర్చు ఆదా అవుతాయి" అని వివరించారు. గత ప్రభుత్వం కేంద్రం నిధులను సద్వినియోగం చేసుకోలేకపోయిందని, ఇతర రాష్ట్రాలు వేల కోట్లు వినియోగించుకుంటే, గొడ్డలి పార్టీ కేవలం రూ.2,600 కోట్లు మాత్రమే ఖర్చు చేసి రాష్ట్రానికి అన్యాయం చేసిందని ఆయన ఆరోపించారు.

### - రాయలసీమ దశ మార్చేస్తాం.. రత్నాల సీమగా తీర్చిదిద్దుతాం

రాయలసీమ అభివృద్ధిపై తనకున్న దార్శనికతను వివరిస్తూ, "ఒకప్పుడు కరువు సీమ, రాళ్ల సీమగా పిలిచిన ఈ ప్రాంతాన్ని రత్నాల సీమగా, దేశంలోనే అగ్రగామిగా నిలబెడతాం. మదనపల్లెలో లక్ష కోట్ల రూపాయలతో ప్రపంచానికి ఒక హార్టికల్చర్ హబ్‌గా తయారు చేసే కార్యక్రమానికి ఇప్పటికే శ్రీకారం చుట్టాం. రెండేళ్లలో రూ.24,000 కోట్లు ఖర్చు చేశాం. గొడ్డలి పార్టీ ఐదేళ్లలో ఖర్చు చేసింది కేవలం రూ.2,500 కోట్లు మాత్రమే. తేడా మీరే గమనించండి" అని అన్నారు. "రాయలసీమలో కేవలం హార్టికల్చర్ మాత్రమే కాదు, రాబోయే రెండేళ్లలో నెలకు రెండు శాటిలైట్లను ఇక్కడి నుంచే ప్రయోగించేలా స్పేస్ టెక్నాలజీ, పుట్టపర్తి నుంచి శత్రుదేశాల గుండెల్లో వణుకు పుట్టించే ఐదో తరం ఫైటర్ జెట్‌లను తయారు చేసే ఏరోస్పేస్, డ్రోన్ సిటీ, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, స్టీల్, సిమెంట్, గ్రీన్ ఎనర్జీ వంటి ఎన్నో పరిశ్రమలు రానున్నాయి. ఒకప్పుడు స్వర్ణగిరిగా పిలిపించుకున్న జొన్నగిరిలో మళ్లీ బంగారు గనులు వచ్చాయి. రాయలసీమ సత్తా ఇది. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాలుగా అభివృద్ధి చెందుతాయి. బుల్లెట్ రైళ్లు, రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ తయారీ పరిశ్రమ కూడా ఇక్కడికే వస్తుంది. ఈ ప్రాంత యువత బుల్లెట్‌లా దూసుకుపోవాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

### - పవన్ కల్యాణ్ నాయకత్వంలో పల్లెల ప్రగతి

కూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పనితీరును చంద్రబాబు ప్రశంసించారు. "నా మిత్రుడు పవన్ కల్యాణ్ గ్రామీణాభివృద్ధికి కొత్త రూటు వేశారు. మరెక్కడా లేని విధంగా పవన్ కల్యాణ్ రికార్డు స్థాయిలో ఒకేరోజు 13,326 గ్రామాల్లో గ్రామసభలు పెట్టించారు. ఆయన నాయకత్వంలో రెండున్నర దశాబ్దాల తర్వాత 10 వేల మందికి పైగా ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాం. పంచాయతీలకు రూ.4,136 కోట్ల నిధులు విడుదల చేయించాం. లక్షకు పైగా పంట కుంటలు, గోకులాలు ఏర్పాటు చేశారు. ఆయన నేతృత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కోసం ఐదేళ్లలో రూ.1.30 లక్షల కోట్లు ఖర్చు చేయబోతున్నాం" అని ప్రకటించారు.

### - గొడ్డలి పార్టీకి సూటి ప్రశ్నలు.. ధైర్యం ఉంటే సమాధానం చెప్పాలి

ఈ క్రమంలో గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్వరంతో విరుచుకుపడ్డారు. "ఈ కడప గడ్డ, ప్రొద్దుటూరు నుంచే సవాల్ విసురుతున్నా. వివేకానంద రెడ్డి హత్య కేసులో వాస్తవాలు బయటకు వచ్చాయి. అంతిమ లబ్ధిదారు ఎవరో తేలిపోయింది. రూ.40 కోట్ల సుపారీ గుట్టు విప్పింది. దీనిపై సమాధానం చెప్పే ధైర్యం ఉందా? లిక్కర్ స్కామ్‌లో వేల కోట్లు దోచిన అంతిమ లబ్ధిదారు కూడా నువ్వేనని అన్ని వేళ్లూ నీ వైపే చూపిస్తున్నాయి. సమాధానం చెప్పగలవా?" అని నిలదీశారు. "ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షల్లో అక్రమాలు చేసి యువత జీవితాలతో ఆడుకున్నారు. ఇసుకను దోచుకున్నారు. మేము అధికారంలోకి వచ్చాక ఉచిత ఇసుక విధానం తెచ్చాం. మద్యం ధరల విషయంలోనూ పారదర్శకంగా ఉన్నాం. కానీ, వాళ్లు నేరాలు చేసి, ఆ నెపాన్ని ఎదుటివారిపై రుద్దడమే పనిగా పెట్టుకున్నారు. అదే వారి డీఎన్ఏ. వారికి అభివృద్ధి సిద్ధాంతం కాదు, కుట్రలు, హింసా రాజకీయాలే వారి సిద్ధాంతం" అని దుయ్యబట్టారు.

### - ప్రొద్దుటూరుకు వరాలు.. స్థానిక సమస్యలకు పరిష్కారం

స్థానిక ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి కోరిక మేరకు ప్రొద్దుటూరు అభివృద్ధికి పలు వరాలు ప్రకటించారు. డ్రైనేజీల నిర్మాణం కోసం రూ.35 కోట్లు, కొర్రపాడు రోడ్డు విస్తరణకు రూ.8 కోట్లు తక్షణమే మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ మార్కెట్ రీమోడలింగ్ పనులను త్వరలోనే పరిష్కరిస్తామని, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కాలేజీల భవన నిర్మాణాలను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రాజోలి, అలగనూరు రిజర్వాయర్ల పనులను కూడా పూర్తి చేసి సాగునీటి సమస్యను తీరుస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు.

### - ట్రిపుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి పరుగులు

చివరగా, ప్రజల మద్దతును కోరుతూ, "కేంద్రంలో మోడీ గారి నాయకత్వంలో, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి పాలనతో డబుల్ ఇంజన్ సర్కార్ బుల్లెట్ వేగంతో దూసుకెళ్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కూటమి అభ్యర్థులను గెలిపిస్తే, ట్రిపుల్ ఇంజన్ సర్కార్ వస్తుంది. అప్పుడు అభివృద్ధి మరింత వేగవంతం అవుతుంది. కుట్ర రాజకీయాలను తిప్పికొట్టి, అభివృద్ధికి పట్టం కట్టండి," అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సభకు హాజరైన ప్రజల ఉత్సాహాన్ని చూసి, వారికి ధన్యవాదాలు తెలుపుతూ, "భారత్ మాతా కీ జై, తెలుగు తల్లికి జై" నినాదాలతో తన ప్రసంగాన్ని ముగించారు.

# అధికారం ముసుగులో అవినీతి బాగోతం

- హైదరాబాద్‌లో అవినీతి అధికారిణులు - రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ
- రూ.4 లక్షల లంచం తీసుకుంటూ దొరికిన టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్
- రూ. 1 లక్ష లంచంతో దొరికిన రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వో





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో ఇటీవల అవినీతి అధికారులు భారీ సంఖ్యలో ఏసీబీకి పట్టుబడుతున్నసంగతి తెలిసిందే. కానీ అధికారుల్లో మాత్రం ఎలాంటి మార్పు రావడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా రోజుకో అధికారి ఎక్కడో ఓ చోట ఏసీబీ అధికారులకు చిక్కుతూనే ఉన్నారు. తాజాగా గోల్కొండ జోన్ జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్ తులసీ రామ్ సునీత ఏసీబీకి చిక్కారు. ఓ భవన నిర్మాణానికి సహకరించేందుకు రూ. 8 లక్షలు డిమాండ్ చేశారు. అయితే చివరకు రూ. 6.5 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అందులో తొలి విడతగా రూ. 4 లక్షలు తీసుకుంటుండగా సోమవారం ఏసీబీ అధికారులు తులసీ రామ్ సునీతను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఆమె నుంచి రూ. 4 లక్షలు లంచం సొమ్మును రికవరీ చేశారు. అలాగే సోదాల సమయంలో లెక్కల్లో చూపని మరో రూ.2.50 లక్షలను స్వాధీనం చేసుకున్నారు.జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్ తులసీ రామ్ సునీత తన అధికారాన్ని దుర్వినియోగం చేయడమే కాకుండా అనుచిత లబ్ది పొందేందుకు యత్నించినందుకుగాను ఆమెపై ఏసీబీ అధికారులు చట్టపరమైన కేసులు నమోదు చేశారు. ఈ మేరకు నిందితురాలిని నాంపల్లిలోని అడిషనల్ ప్రత్యేక జడ్జి ముందు హాజరుపర్చినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ప్రస్తుతం కేసు దర్యాప్తులో ఉన్నందున భద్రతా కారణాల రీత్యా ఫిర్యాదుదారు వివరాలను వెల్లడించడం లేదని స్పష్టం చేశారు. ఇదే రోజు అంతకుముందు రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వో స్వర్ణ కుమారి ఏసీబీ వలకు చిక్కారు. ఓ ప్రైవేట్ హాస్పిటల్ కు అనుకూలంగా వ్యవహరించేందుకు రూ. 2 లక్షల లంచం డిమాండ్ చేశారు.అయితే రూ. 2 లక్షల్లో భాగంగా రూ. 1 లక్ష ఇవ్వాలని స్వర్ణకుమారి కోరినట్లు బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈ క్రమంలో అధికారులు అప్రమత్తం అయ్యారు. మొదటగా బాధితుడు రూ. లక్షను హెల్త్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్ కు అందజేశాడు. ఆ తర్వాత ఆ నగదును డీఎంహెచ్‌ఓ డ్రైవర్ కృష్ణయ్యకు ఇచ్చినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఆ డబ్బులను కారులో పెట్టేందుకు వెళ్తున్న సమయంలో కృష్ణయ్యను పట్టుకున్నారు. ఈ మేరకు ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు. ఇక ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే దర్యాప్తులో వెలుగులోకి రానున్నట్లు తెలుస్తోంది.

# కేటిఆర్ సీఎం రేవంత్ రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేస్తే నాలుక కోస్తాం

**హైద్రాబాద్** కేటిఆర్ సీఎం రేవంత్ రెడ్డి పై తప్పుడు ఆరోపణలు చేస్తే నాలుక కోస్తాం జాగ్రత? అనిటీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం హెచ్చరించారు.సోమవారం గాంధీ భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ కేటిఆర్ కు దమ్ముంటే సీఎం రేవంత్ రెడ్డి కుటుంబం ఆస్తులుపై ఆధారాలు ఉంటే బయట పెట్టాలని డిమాండ్ చేశారు. కేటిఆర్ హైటెక్ సిటీలో యశోద ఆసుపత్రికి 210 కోట్ల ఎకరాల ప్రభుత్వ భూమిని 33కోట్లకు ఇచ్చారు. కరోన టైం లో యశోద ఆసుపత్రి 3వేల కోట్లు సంపాదించాడు. యశోద ఆసుపత్రికి ఎకరానికి 11కోట్ల చొప్పున 3ఎకరాలకు డబ్బులు ఇచ్చిండు. రెండు ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా పెట్టిండన్నారు. గజం లక్షా 50వేల ఉంటే గజం 33వేల కే ఇచ్చిండు. 16.06.205 జీవో 82,సర్వే నిసి.41/147.10.2015 జివో 191 ద్వారా యశోద ఆసుపత్రికి భూమిని ధారా దత్తం చేసిండు. 2015 లో కేటిఆర్ కు 15 శాతం వాటా ఇచ్చిండు, వాటి మీద ఇప్పుడు విచారణ జరుగుతుంది. కేటిఆర్ కు మతి స్థిమితం లేదు. పిచ్చి లేచి రోడ్ల పై తిరుగుతుండు.కేటిఆర్ ను ఎర్రగడ్డ కు పంపించాల్సిందే. కేటిఆర్ చెంచా గాళ్లతో మాట్లాడిస్తున్నారు. మెడీకవర్ ఇప్పుడు పెట్టింది కాదు,సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభానికి మాత్రమే పోయాడు. మెడీకవర్ ఎండి డాక్టర్ అనిల్ కృష్ణ 42 మంది డైరెక్టర్లు. మెడికవర్ ఎండి అనిల్ కృష్ణ ను బెదిరించి కేటిఆర్ పది ఏండ్లు ఏడాదికి 10 కోట్లు లాగా 100 కోట్లు తీసుకుండు. కేటిఆర్ ఎపి అమరావతి లో 1000 కోట్లతో భార్య శైలిమా ఒరుతో హోటల్ కట్టిండు. కోహినూర్ హోటల్ లో బెదిరించి 25శాతం వాటా తీసుకున్నాడని ఆరోపించారు. కేటిఆర్ అయ్యకు అబ్బకు పుట్టి ఉంటే వాస్తవం కాదని చెప్పాలి. మా ముఖ్యమంత్రి గా ప్రమాణం స్వీకారం చేసినప్పటినుండి ఒక్క రూపాయి లేదు. నేను చూపించే హోటల్స్ ఆధారాలు అన్ని కేటిఆర్ ఒప్పుకుండు. 2021 లో జగన్ కు డబ్బులు ఇచ్చిండు. మెడికవర్ తో సీఎం రేవంత్ రెడ్డికి సంబంధం లేదు. రేవంత్ రెడ్డి కుటుంబనికి సంబంధం ఉంటే ఆధారాలు యట పెట్టాలి. మాక్సిన్ ఫార్మా కంపెనీ 31.03 2023 ః తీబ హయాంలో పెట్టారుమాక్స్ బిన్ తో ముఖ్యమంత్రి కి సంబంధం ఏముందని ప్రశ్నించారు. కేసీఆర్ ముఖ్యమంత్రి గా ఉన్నప్పుడు 2023 లో సీఎం రేవంత్ రెడ్డి అల్లుడికి 16శాతం వాటా ఉందిస్వచ్ బయో కంపెనీ జూన్ 24. 2025 లో ప్రారంభం అయిందిపసుపునూరి హరివర్ధన్ రెడ్డి డైరెక్టర్ ముఖ్యమంత్రి కి సంబంధం లేదుసోడా కన్స్ట్రక్షన్ కంపెనీమాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి కొడుకుది. 2010 జూలై 12 న కంపెనీ పెట్టారుకేసీఆర్ ముఖ్యమంత్రి గా ఉన్నప్పుడు గీత హుందాయి షో రూమ్ 2021 లో పెట్టారుసీఎం రేవంత్ రెడ్డి సతీమణి ఫ్యామిలీ ముందు నుండే ఉన్నత కుటుంబం. అపుడు రేవంత్ రెడ్డి మంత్రి కాదు, ముఖ్యమంత్రి కాదుమైండ్ వాల్ట్ కార్పోరేట్ స్కూల్ సీఎం రేవంత్ రెడ్డి కూతురిది అని కేటిఆర్ తప్పుడు ప్రచారం చేస్తుండుమైండ్ వాల్ట్ కార్పోరేట్ స్కూల్ హైదరాబాద్ లేదు2014 ముందు కేటిఆర్ కు ఒక్క రూపాయి లేదు2014 తర్వాత వేల కోట్లు ఎట్లా వచ్చినవి కేటిఆర్? అని ప్రశ్నించారు.దొర అహకారం తో ప్రజలను తప్పుదోవ పట్టిస్తే కేటిఆర్ ను తన్ని తరిమివేస్తారు

# రెస్టారెంట్లలో మున్సిపల్ అధికారుల ఆకస్మిక తనిఖీలు






జగిత్యాల(ప్రశ్న న్యూస్) జగిత్యాల మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్ ఆదేశాల మేరకు జగిత్యాల పట్టణంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బృందం సోమవారం పలు రెస్టారెంట్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెస్టారెంట్లలో ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, శానిటరీ పరిస్థితులను అధికారులు పరిశీలించారు. తనిఖీలలో కుళ్లిపోయిన ఆహార పదార్థాలు, పరిశుభ్రత లోపాలు గుర్తించిన పి ఎం ఆర్, మండి, కింగ్స్ మండి రెస్టారెంట్లపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుని మొత్తం రూ. 20,000 వరకు జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్ మాట్లాడుతూ పట్టణంలోని అన్ని రెస్టారెంట్లు, హోటళ్లు తప్పనిసరిగా పరిశుభ్రత ప్రమాణాలను పాటించాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించడం నిర్వాహకుల బాధ్యత అని పేర్కొన్నారు. ఆహార పదార్థాలను పరిశుభ్రమైన వాతావరణంలో నిల్వ చేయడంతో పాటు, కుళ్లిపోయిన లేదా నాణ్యత లేని ఆహార పదార్థాలను వినియోగించరాదని హెచ్చరించారు. పరిశుభ్రత ప్రమాణాలను పాటించకుండా ప్రజల ఆరోగ్యానికి ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించే హోటళ్లు, రెస్టారెంట్లపై మున్సిపల్ శాఖ తరఫున ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ తనిఖీలలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్, రాము, చందు, జవాన్లు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా అశోక్ సింఘాల్ శత జయంతి వేడుకలు

**హైదరాబాద్** హైదరాబాద్ లో విశ్వహిందూ పరిషత్ అగ్రనేత దివంగత అశోక్ సింగల్ శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అశోక్ సింగల్ శత జయంతి వేడుకల సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వహిందూ పరిషత్ హిందూ సమాజ సంఘటితం కోసం మరియు ధార్మిక చైతన్యం కోసం అయోధ్య శ్రీరామ జన్మభూమి ఉద్యమంలో అశోక్ సింగల్ పోషించిన కీలక పాత్రను స్మరించుకున్నారు. అలాగే విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో అశోక్ సింగల్ పాత్ర పోషించిన గురించి తెలిపారు. 25 లక్షల మందితో ప్రోగ్రాంను నిర్వహించడాన్ని కొనియాడారు . శ్రీరామ జన్మభూమి ఏర్పాటు చేయడంలో అశోక్ సింగల్ పాత్ర గణనీయమైందని అన్నారు

## సూర్యాపేట జిల్లాలో "గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ - క్యూవిఎస్ఈ" పేరుతో భారీ ట్రేడింగ్ మోసం

**సూర్యాపేట** జిల్లాలో భారీ సైబర్ మోసం నమోదయింది. గ్లోబల్ ఇన్వేస్ట్ మెంట్ క్యూవిఎస్ఈ" పేరిట జరిగిన మోసం బయటపడింది. రోజువారి చెల్లింపులు, అకర్షణీయ కమిషన్లు అనగానే జనాలు ట్రాప్ లో పడ్డారు. యాప్లో ఎంట్రీకి రూ.50 వేల డిపాజిట్. రోజుకు 5 డాలర్లు చెల్లిస్తామంటూ బురిడీ కొట్టారు. కొత్త సభ్యుడిని చేర్పిస్తే రూ.7,500 కమిషన్ ఇస్తామనడంతో కమిషన్ల కోసం దళారులు సభ్యులను భారీగా చేర్పించారు. గ్రామీణ ప్రజలే టార్గెట్ గా దందా నడిచింది. నమ్మి పెట్టుబడి పెట్టిన 110 మంది బాధితులు బయటపడ్డారు. ఒక్క నూతనకల్ గ్రామం నుంచే రూ.30 లక్షలు సైబర్ నేరస్తుల ఖాతాల్లోకి వెళ్లినట్టు తెలుస్తోంది.."తక్కువ పెట్టుబడి – ఎక్కువ రాబడి" మాటలు నమ్మొద్దని ఎస్పీ నరసింహ హెచ్చరించారు.

## క్రికెటర్ తిలక్ వర్మకు ఘన స్వాగతం

**హైదరాబాద్** 2026 ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకంతో మెరిసిన హైదరాబాదీ క్రికెటర్ తిలక్ వర్మ కు శంషాబాద్లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నాడు. విమానాశ్రయంలో తిలక్ వర్మకు అభిమానులు, క్రీడాభిమానులు ఘన స్వాగతం పలికారు.

## పోరు బాట పట్టిన ఫీల్డ్ అసిస్టెంట్లు

**తాడేపల్లి** సోమవారం నాడు తాడేపల్లికి ఫీల్డ్ అసిస్టెంట్లు భారీగా చేరుకున్నారు. సామూహిక రాయబారం పేరుతో ఛలో పంచాయతీ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నాకు ఫీల్డ్ అసిస్టెంట్లు పిలుపునిచ్చారు. పెండింగ్ బకాయిల విడుదల, వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత ప్రధాన డిమాండ్ చేసారుజ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి ఫీల్డ్ అసిస్టెంట్లు ధర్నా కు భారీగా తరలివచ్చారు. ఈ నేపథ్యంలో పోలీసులు పంచాయతీ కార్యాలయం వద్ద భారీగా మోహరించారు.

## అక్బరుద్దీన్ రాజకీయ సన్యాసం..

**హైదరాబాద్ :** హైదరాబాద్ పాతబస్తీ రాజకీయాల్లోనూ, ఎంఐఎం శాసనసభా పక్ష నేతగానూ క్రియాశీలక పాత్ర పోషిస్తున్న అక్బరుద్దీన్ ఓవైసీ? వచ్చే ఎన్నికల్లో పోటీ చేయకపోవచ్చంటూ స్వయంగా చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అవుతున్నాయి. తన విద్యాసంస్థ కార్యక్రమంలో విద్యార్థులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నాకు వయస్సు అయిపోయింది, వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానో లేదో తెలియదు, అసలు పోటీ చేయాలనే ఆలోచన కూడా నాకు లేదు అని ఆయన సంచలన ప్రకటన చేశారు. అక్బరుద్దీన్ ఈ నిర్ణయానికి రావడం వెనుక ప్రధాన కారణంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని చెప్పుకోవచ్చు. 2011లో బార్కాస్‌లో ఆయనపై జరిగిన దాడి అనంతరం ఆయన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడింది. రెండు, మూడు సార్లు ఆయన పరిస్థితి విషమం అనే ప్రచారం జరిగింది. గత కొన్నేళ్లుగా వెన్నునొప్పి, ఇతర అంతర్గత ఆరోగ్య సమస్యలతో నిరంతరం వైద్య సంరక్షణలో ఉంటున్న ఆయన, నిరంతర ప్రచార ఒత్తిడిని , అసెంబ్లీలో సుదీర్ఘ రాజకీయ కసరత్తును తట్టుకోవడం శారీరకంగా సవాలుగా మారిందని సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు పాతబస్తీలో ఓవైసీ కుటుంబ తదుపరి తరం ఫీల్డులోకి రాబోతోందని చెబుతున్నారు. చంద్రాయణగుట్ట నియోజకవర్గం దశాబ్దాలుగా ఓవైసీ కుటుంబానికి కంచుకోటగా ఉంది. అక్బరుద్దీన్ స్థానంలో ఆయన కుమారుడు నూరుద్దీన్ ఓవైసీని రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బరిలోకి దింపేందుకు రంగం సిద్ధమవుతోందనే చర్చ జోరందుకుంది. పాతబస్తీ ఓటర్లకు నూరుద్దీన్‌ను పరిచయం చేస్తూ, అక్బరుద్దీన్ వెనుక ఉండి మార్గదర్శకత్వం వహించే దిశగా పార్టీ నాయకత్వం ప్రణాళిక రచిస్తున్నట్లు సమాచారం. వయసు అయిపోయింది అనే కారణం అయితే.. ఆయన సోదరుడు అసదుద్దీన్.. అక్బరుద్దీన్ కంటే పెద్ద. మరి ఆయనేం అనుకోవాలన్న ప్రశ్నలు వస్తున్నాయి. తాను కేవలం 12వ తరగతి వరకే చదివానని చెప్పడానికి ఏమాత్రం సిగ్గుపడనని ఎమ్మెల్యే అక్బరుబ్బీన్ అన్నారు. తక్కువ చదువు చదివినప్పటికీ, ఎంతో కీర్తి ప్రతిష్ఠలు సంపాదించడంతో పాటు ఎన్నో ఒవైసీ విద్యాసంస్థల భవనాలను నిర్మించినందుకు గర్వంగా ఉందన్నారు. కొందరు ఉద్దేశపూర్వకంగానే తన పరువు తీయడానికి, ఇబ్బందులకు గురిచేయడానికి రకరకాల కుట్రలు చేస్తున్నారని, కానీ తాను ఎవరి ముందూ తలవంచే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ దేశం, ఈ గడ్డ అందరిదని, ఇక్కడ ప్రతి పౌరుడికి సమాన హక్కులు ఉన్నాయని చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఒకవేళ తాను భౌతికంగా ఉన్నా, లేకపోయినా తాను నెలకొల్పిన ఒవైసీ విద్యాసంస్థల భవనాల్లో తన గళం శాశ్వతంగా నిలిచిపోతుందని అక్బరుద్దీన్ ఒవైసీ భావోద్వేగానికి లోనయ్యారు. రాజకీయాలు, ఇక్కడి మిగతా వ్యవహారాలు అన్నింటినీ వదిలేసి మక్కాలోనే ఉండిపోవాలని ఉందన్నారు. మక్కాలోనే కన్నుమూయాలనేది తన చివరి కోరికని ప్రసంగంలో తెలిపారు.

# రూ. 45 లక్షల కోసం వ్యాపారి దారుణ హత్య.?

**మురహరిపల్లి చెరువు కట్టపై ( వ్యాపారీ ) వ్యక్తి మృతదేహం**

**రూ.10 లక్షల నగదుతో ఇంటి నుంచి వెళ్లిన మృతుడు**

**కలకలం రేపుతున్న వ్యాపారి నేమారం చౌదరి హత్య కేసు**





మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) రూ. 40 లక్షల కోసం ఓ వ్యాపారిని హత్య చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. రెండు రోజుల క్రింద మేడ్చల్ జిల్లా పేట్ బషీరాబాద్ పి.యస్ లో మిస్సింగ్ కేసు నమోదు కలకలం రేపుతున్న వ్యాపారి నేమారం చౌదరి హత్య కేసు వ్యాపారి దగ్గర డబ్బులు కోసమే హత్య చేసి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. వ్యాపారి నేమారం చౌదరి ని అత్యంత దారుణంగా హత్య చేసిన గుర్తు తెలియని వ్యక్తులు మొహం గుర్తుపట్టకుండా ఉండేందుకు యాసిడ్ ఆనవాళ్ళు పోసి హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వ్యాపారి నేమారం చౌదరి పై విచక్షణా రహితంగా దాడి చేసినట్లు మృతుని ఒంటిపై ఉన్న గాయాలను తెలుస్తుందని పోలీసులు పేర్కొంటున్నారు మూడు రోజుల క్రితం ఇంట్లో అల్వాల్ కు వెళ్తున్నానని చెప్పిన మృతుడు భజన్ ఉందని, ఆలస్యం అవుతుందని భార్యకు చెప్పి వెళ్ళాడు. ఇంట్లో నుండి 10 లక్షలు, అలాగే వేరే వ్యక్తి వద్దనుండి మరి కొంత డబ్బు తీసుకొని వెళ్లినట్లు తెలుస్తోంది. మొత్తం మృతుని వద్ద సుమారు 45 లక్షల వరకు డబ్బులు ఉన్నట్లు సమాచారం. అల్వాల్ లో ఓ వ్యక్తి కి ఇవ్వాలి అది వెళ్లినట్లు సమాచారం. అల్వాల్ లో తన బైక్ ఓ బ్రిడ్జి వద్ద పక్కన పెట్టి నడుచుకుంటూ వెళ్లినట్లు పోలీసులు భావిస్తున్నారు. కొంచెం ముందుకు వెళ్ళాక థార్ వేహికిల్ ఎక్కినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మురహరి పల్లి చెరువు కట్ట వద్ద రెండు రోజుల తరువాత చివరకు మృతదేహం లభ్యం అయింది.

# విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండండి

- ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి
- దోమలు పెరగకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి
- పగలు కూడా దోమల కాటు నుంచి రక్షణ పొందేందుకు పూర్తి చేతుల దుస్తులు ధరించడం, దోమల నివారణ చర్యలు పాటించడం మంచిది
- తగినంత ద్రవాలు తీసుకుంటూ శరీరంలో నీరు తగ్గకుండా చూసుకోవాలి
- జ్వరం ఉన్నప్పుడు విశ్రాంతి తీసుకోవాలి - వైద్యుల సలహా లేకుండా యాంటీబయాటిక్స్, నొప్పి నివారణ మందులు లేదా ఇతర మందులు వాడకూడదు
- ముఖ్యంగా డెంగ్యూ అనుమానం ఉన్నప్పుడు ఆస్పిరిన్, ఐబుప్రోఫెన్ వంటి మందులను వైద్యుల సలహా లేకుండా తీసుకోకూడదు, ఎందుకంటే రక్తస్రావం ప్రమాదం పెరగవచ్చు.
- పిల్లలు, వృద్ధులు, గర్భిణులు లేదా ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారిలో జ్వరం ఉంటే మరింత జాగ్రత్త అవసరం





జ్వరం వచ్చిన ప్రతిసారీ అది డెంగ్యూ లేదా టైఫాయిడ్ అని భావించాల్సిన అవసరం లేదు. అదే సమయంలో సాధారణ జ్వరమని నిర్లక్ష్యం చేయడం కూడా మంచిది కాదు. సరైన సమయంలో వైద్య పరీక్షలు చేయించుకుని, వైద్యుల సూచనలను పాటిస్తే చాలా వరకు సమస్యలను నివారించవచ్చు.

జ్వరాల సీజన్‌లో జాగ్రత్తలు తప్పనిసరి

మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) వాతావరణ మార్పులు, కారణంగా ప్రస్తుతం జ్వరాల ప్రభావం పెరుగుతోంది. వైరల్ ఫీవర్, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి జ్వరాలతో పలువురు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ముఖ్యంగా డెంగ్యూ జ్వరంలో కొందరికి ప్లేట్లెట్ సంఖ్య తగ్గే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

### జ్వరం వస్తే వైద్యుని సలహా మేరకు పరీక్షలు

జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, నీరసం, వాంతులు, ఆకలి తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకూడదు. వైద్యులను సంప్రదించి వారి సూచన మేరకు అవసరమైన రక్త పరీక్షలు చేయించుకోవాలి. సొంతంగా మందులు వాడటం ప్రమాదకరం.

### ప్లేట్లెట్లు తగ్గాయని భయపడాల్సిన అవసరం వుందా?

డెంగ్యూ వంటి కొన్ని ఇన్ఫెక్షన్లలో ప్లేట్లెట్ కౌంట్ తగ్గవచ్చు. అయితే ప్లేట్లెట్ సంఖ్య తగ్గడం ఒక్కటే వ్యాధి తీవ్రతకు కొలమానం కాదు. రోగి పరిస్థితి, రక్తస్రావం ఉందా లేదా, ఇతర రక్త పరీక్షల ఫలితాలు, శరీరంలో ద్రవాల స్థితి వంటి అంశాలను వైద్యులు పరిగణనలోకి తీసుకుంటారు.

అందువల్ల ప్లేట్లెట్లు తగ్గాయని ఆందోళన చెందకుండా వైద్యుల పర్యవేక్షణలో చికిత్స తీసుకోవాలి. అవసరం లేకుండా ప్లేట్లెట్లు ఎక్కించుకోవడం లేదా స్వయంగా మందులు తీసుకోవడం చేయకూడదు.

### దోమల నియంత్రణే ప్రధాన రక్షణ

ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. కూలర్లు, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ డబ్బాలు వంటి వాటిలో నీరు నిల్వ ఉంటే వెంటనే తొలగించాలి.

దోమలు పెరగకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి. దోమల కాటు నుంచి రక్షణ కోసం దోమతెరలు, దోమల నివారణ పద్ధతులు ఉపయోగించడంతో పాటు పగటి సమయంలోనూ దోమల నుంచి రక్షణ పొందేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

### ఆహారం, నీటిపై ప్రత్యేక శ్రద్ధ

జ్వరం వచ్చినప్పుడు తగినంత విశ్రాంతి తీసుకోవడంతో పాటు శరీరంలో నీరు తగ్గకుండా ద్రవాలు తీసుకోవాలి. పరిశుభ్రమైన నీరు, తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవడం మంచిది. అయితే ఏ ఆహారం లేదా మందు తీసుకోవాలో వైద్యుల సలహాకు ప్రాధాన్యం ఇవ్వాలి.

### ప్రమాద సూచనలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి

తీవ్రమైన కడుపునొప్పి, పదేపదే వాంతులు, ముక్కు లేదా చిగుళ్ల నుంచి రక్తస్రావం, వాంతులు లేదా మలంలో రక్తం, తీవ్రమైన నీరసం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, మగత వంటి లక్షణాలు

# గత ప్రభుత్వం జలజీవన్ మిషన్ నిధులను నిర్వీర్యం చేసింది



అమరావతి (ప్రశ్న న్యూస్) "యుద్ధం వచ్చినప్పుడు, హద్దులు దాటినప్పుడు నా గొంతు ఎలా ఉంటుందో మీకు తెలుసు. కానీ ఇది శాంతి సమయం. ప్రజలకు అభివృద్ధి చేయాల్సిన సమయం. అందుకే రాయలసీమ పౌరుషానికి తగిన స్పీచ్ మాట్లాడట్లేదు. రాయలసీమ అభివృద్ధికి అవసరమైన విధంగా మాట్లాడుతున్నా. గొడవలు, కొట్లాటలు, గొడ్డలి పోట్లు కాకుండా అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్దాం" అంటూ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాయలసీమ పౌరుషాన్ని ప్రస్తావిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గొడవలకు, పౌరుషానికి ప్రతీకగా నిలిచిన ఈ నేల రూపురేఖలను అభివృద్ధి పథంలో మార్చాలని ఆయన పిలుపునిచ్చారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి రూ.30,156 కోట్ల విలువైన 'అమరజీవి జలధార' పథకానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పవన్ కల్యాణ్ తనదైన శైలిలో ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు మీద ఈ బృహత్తర తాగునీటి పథకాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని పవన్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3.27 కోట్ల మంది ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో 24,601 ఆవాసాల్లో 50,315 పనులను ఈ పథకం కింద చేపట్టనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన 'హర్ ఘర్ జల్ – జలజీవన్ మిషన్'కు 2019–24 మధ్య అధికారంలో ఉన్న ప్రభుత్వం తూట్లు పొడిచింది. రూ.26,000 కోట్ల విలువైన పనులకు ప్రతిపాదనలు పంపి, ఐదేళ్లలో కేవలం రూ.2,700 కోట్లు మాత్రమే ఖర్చు చేసి ఏ ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదు. ప్రజల తాగునీటి కష్టాలను ఏమాత్రం పట్టించుకోలేదు" అని దుయ్యబట్టారు. 2024లో ఈ పథకం ముగిసిపోవాల్సిన తరుణంలో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాను, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు సి.ఆర్. పాటిల్, నిర్మలా సీతారామన్‌లను కలిసి విజ్ఞప్తి చేశామని గుర్తుచేశారు. వారి సహకారంతో ఈ పథకాన్ని 2028 వరకు పొడిగించుకుని, పనులను వేగవంతం చేశామని తెలిపారు. "గత ప్రభుత్వం ఖర్చు చేయగా మిగిలిన పనులతో పాటు, ఇప్పటికే మేము రూ.4,500 కోట్ల విలువైన పనులను పూర్తి చేశాం. మీరు మాపై ఉంచిన నమ్మకమే మాకు శ్రీరామరక్ష" అని పవన్ పేర్కొన్నారు. తమది కక్షసాధింపుల ప్రభుత్వం కాదని, ప్రజాభివృద్ధిని మాత్రమే లక్ష్యంగా పెట్టుకుందని పవన్ స్పష్టం చేశారు. "దశాబ్దాలుగా తాగునీటి సమస్యతో అల్లాడుతున్న పులివెందుల నియోజకవర్గంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పథకాలకు రూ.280 కోట్లు కేటాయించి 7 మండలాల్లోని 299 గ్రామాలకు నీరందిస్తున్నాం.

అలాగే, వైసీపీ ఎంపీ ఉన్నప్పటికీ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు, పాడేరు నియోజకవర్గాల్లో రూ.2,500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. మాకు పార్టీలు కాదు, ప్రజల సమస్యలే ముఖ్యం" అని ఉద్ఘాటించారు.

గత ప్రభుత్వ హయాంలో తమ పార్టీకి మద్దతిచ్చారనే కారణంతో ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని తాళ్లమాపురం గ్రామ ప్రజలను నాటి శాసనసభ్యుడు తీవ్రంగా అవమానించారని, వారి వినతిపత్రాన్ని కళ్లెదుటే నలిపి పడేశారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గ్రామాల అభివృద్ధి కోసం తక్షణమే రూ.3.5 కోట్లతో సీసీ రోడ్లు, తాగునీటి పథకాలను మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి సమక్షంలో ప్రకటించారు.

రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా మౌలిక వసతులను కల్పిస్తున్నామని గణాంకాలతో వివరించారు. "రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి 2024 వరకు నిర్మించిన వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లు, రిజర్వాయర్ల సామర్థ్యానికి అదనంగా 50 శాతం నుంచి 175 శాతం వరకు కేవలం ఈ ఐదేళ్లలోనే నిర్మించబోతున్నాం" అని తెలిపారు.

నీటిని అందించడం ప్రభుత్వ బాధ్యత అయితే, దాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 'అలీబాబా ఔర్ 40 భూత్' సిరీస్ రివ్యూ!



హిందీ నుంచి ఓ భారీ హారర్ కామెడీ థ్రిల్లర్ రీసెంటుగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సిరీస్ పేరే 'అలీబాబా ఔర్ 40 భూత్'. ఆశా నేగి – విశాల్ వశిష్ఠ ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సిరీస్ కి, కోణార్క్ ముఖర్జీ ... రిషవ్ అగర్వాల్ దర్శకత్వం వహించారు. సెప్టెంబర్ 11వ తేదీ నుంచి 'జియో హాట్ స్టార్'లో ఈ సిరీస్ స్ట్రీమింగ్ అవుతోంది. వారానికి 4 ఎపిసోడ్స్ చొప్పున వదులుతున్నారు. ఇంతవరకూ 16 ఎపిసోడ్స్ అందుబాటులోకి వచ్చాయి. కథలోకి వెళితే .. అది 'జూలియా' అనే ప్రాంతం. అక్కడ 'తపీష్' (ఉజ్వల్ చోప్రా) నివసిస్తూ ఉంటాడు. చాలా కాలంగా ఆయన పురావస్తు శాఖలో పనిచేస్తూ ఉంటాడు. వేరే ప్రాంతాలలో ఉంటున్న పెద్ద కూతురుకుగానీ .. చిన్నకూతురు 'అలీషా' (ఆశా నేగి)కిగాని ఆయన నుంచి కొన్ని రోజులుగా కాల్స్ వెళ్లవు. ఆయన నుంచి అలీషాకి ఒక వాయిస్ మెసేజ్ వస్తుందిగానీ ఆమెకి అర్థం కాదు. దాంతో ఆమె తన తండ్రిని వెతుక్కుంటూ బంగ్లాకి వస్తుంది. అయితే చాలా రోజులుగా ఆయన ఇంటికి రాలేదనే విషయం ఆమెకి అర్థమవుతుంది. అలీషా నేరుగా పోలీస్ స్టేషన్ కి వెళ్లి తన తండ్రి కనిపించడం లేదని ఫిర్యాదు చేస్తుంది. దాంతో పోలీస్ ఆఫీసర్ 'బాబా' రంగంలోకి దిగుతాడు. ఇన్వెస్టిగేషన్ లో అతనికి సహకరించడం కోసం అలీషా అతని కూడానే ఉంటుంది. అదే సమయంలో అక్కడికి కాస్త దూరంగా ఉన్న 'తమోఘాటి' అనే ప్రాంతంలో, మహాదేశ్ అనే మాంత్రికుడు క్షుద్రపూజలు చేస్తుంటాడు. తన దైవమైన 'వక్రసింఘ' ఆగమనం కోసం అతను ఎదురుచూస్తుంటాడు. తన అనుచరులతో అతను కూడా తపీశ్ కోసం వెతికిస్తుంటాడు. ఆ ఊళ్లో భూతాలు తిరుగుతున్నాయనే ఒక ప్రచారం జరుగుతూ ఉంటుంది. మరో వైపున మేకలు చనిపోతూ ఉంటాయి .. మనుషులు హత్య చేయబడుతుంటారు. అలాంటి పరిస్థితులలో తపీశ్ సన్నిహితుడైన 'గిరి' నుంచి అలీషాకి కాల్ వస్తుంది. కొన్ని రోజుల క్రితం కొన్ని రహస్య వస్తువులు తవ్వకాలలో తపీశ్ కి లభించాయనీ, వాటి కారణంగా తపీశ్ ప్రమాదంలో పడే అవకాశం ఉందని చెబుతాడు. ఈ విషయాలు 'తల్వార్'కి తెలియనీయవద్దని హెచ్చరిస్తాడు. అలీషా తన తండ్రికి దొరికిన రహస్య వస్తువులు ఏమై ఉంటాయి? వాటిని ఆ బంగ్లాలో ఆయన ఎక్కడ దాచి ఉంచి ఉంటాడు? అనేది 'బాబా'తో కలిసి అన్వేషించడం మొదలుపెడుతుంది. అప్పుడు ఆలీషాకి తన ఇంట్లోని ఒక రహస్య గదిలో ఒక చిత్రమైన బొమ్మ కనిపిస్తుంది. పారా నార్మల్ ఇన్వెస్టిగేటర్ 'అనుభవ వర్మ' వలన, ఆ బొమ్మలకు ప్రేతాత్మలకు సంబంధం ఉందనే విషయం అర్థమవుతుంది. తన తన తండ్రి 'అప్సర' అనే పాడుబడిన థియేటర్ కి వెళ్లిన తరువాత కనిపించకుండా పోయాడని ఆమెకి స్పష్టమవుతుంది. దాంతో ముగ్గురూ కలిసి అక్కడికి వెళతారు. అక్కడ ఏం జరుగుతుంది? ఆ బొమ్మలకు .. ప్రేతాత్మలకు ఉన్న సంబంధం ఏమిటి? మాంత్రికుడైన మహాదేశ్ ఉద్దేశం ఏమిటి? తపేశ్ ఏమైపోయాడు? అనేది మిగతా కథ. 'అలీ'షా .. పోలీస్ ఆఫీసర్ 'బాబా' .. బొమ్మలను ఆవేశించిన 40 భూతాల కథ ఇది. పురావస్తు శాఖలో పనిచేసే ఒక సీనియర్ ఆఫీసర్ కనిపించకుండా పోవడంతో ఈ కథ మొదలవుతుంది. తన తండ్రి జాడ తెలుసుకోవడం కోసం కూతురు రంగంలోకి దిగడంతో ఈ కథ పుంజుకుంటుంది. క్షుద్ర పూజలు .. భూతాలు .. మాంత్రికులతో సంబంధాలున్న పెద్ద తలకాయలు .. వీటిని టచ్ చేస్తూ సాగే ఇన్వెస్టిగేషన్ చుట్టూ ఈ కథ నడుస్తూ ఉంటుంది. సాధారణంగా ఒక క్షుద్రశక్తి మేల్కోవడం .. ఇక అది బయటికి వచ్చి అందరినీ భయభ్రాంతులకు గురిచేసే కథలు చాలా వరకూ ఆసక్తికరంగానే అనిపిస్తాయి. ఈ తరహా కథలకు కామెడీ టచ్ ఇవ్వడం వలన, భయానికి దూరంగా వెళ్లి ఫ్యామిలీ ఆడియన్స్ ఎంజాయ్ చేసేలా మారిపోతాయి. అలా ఆ కోణంలో కామెడీ టచ్ కూడా ఇచ్చారు. కాకపోతే కథను సీరియస్ గా చెప్పడానికి తగిన ఫోకస్ పెట్టలేదని అనిపిస్తుంది. పురావస్తు త్రవ్వకాలలో నలభై బొమ్మలు బయటపడటం దగ్గర నుంచి .. ప్రేతాత్మలను చూపించడం వరకూ కృతకంగానే అనిపిస్తుంది. బావిలో ప్రేతాత్మలు ఉండటానికి గల కారణాన్ని చెప్పే కథ సహజత్వానికి దగ్గరగానే కనిపిస్తుంది. 'వక్రాసింఘ'కి సంబంధించిన ఫ్లాష్ బ్యాక్ మాత్రంగా అంత ఇంట్రెస్టింగ్ గా అనిపించదు. కాకపోతే గ్రాఫిక్ వర్క్ బాగానే అనిపిస్తుంది. ఒక పురావస్తు శాఖకి సంబంధించిన సీనియర్ ఆఫీసర్ కనిపించకుండాపోతే అందుకు సంబంధించిన డిపార్టుమెంటు వైపు నుంచి ఎలా హడావిడి కనిపించదు. కూతురుతో పాటు ఆమె నుంచి ఫిర్యాదు తీసుకున్న పోలీస్ ఆఫీసర్స్ లోను ఎలాంటి కంగారు ఉండదు. ఇక భూతాలు .. హత్యల విషయంలో కూడా అంతే తాపీగా ఈ కథ నడుస్తూ ఉంటుంది. నెక్స్ట్ ఎం జరుగనుందా? అనే ఒక కుతూ హలాన్ని రేకెత్తించలేకపోయారు.

కథ .. స్క్రీన్ ప్లే అంత గొప్పగా ఏమీ అనిపించవు. ఫోటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తాయి. నటీనటుల నటన గురించి చెప్పుకునే స్థాయిలో పాత్రలను డిజైన్ చేయలేదనే చెప్పాలి. మొత్తం 40 ఎపిసోడ్స్ ఉంటాయని అంటున్నారు. అందుబాటులో ఉన్న 16 ఎపిసోడ్స్ ను బట్టి చూస్తే, కామెడీ పరంగా నవ్వించలేక .. ప్రేతాత్మలతో భయపెట్టలేకపోయిన సిరీస్ గానే చెప్పుకోవలసి ఉంటుంది.

# వెంకీ-త్రివిక్రమ్ 'ఆదర్శ కుటుంబం'

# అక్టోబరు 9న రావడంలేదు

## - కారణం ఏంటో చెప్పిన నాగవంశీ



విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఆదర్శ కుటుంబం' సినిమా విడుదల వాయిదా పడింది. ముందుగా ప్రకటించిన ప్రకారం ఈ సినిమా అక్టోబర్ 9న థియేటర్లలోకి రావాల్సి ఉండగా, కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్లు నిర్మాత నాగవంశీ అధికారికంగా ప్రకటించారు. ఈ ఆకస్మిక పరిణామంతో వెంకటేశ్ అభిమానులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. సినిమా వాయిదాకు గల కారణాలను నిర్మాత నాగవంశీ స్పష్టంగా వివరించారు. ఆయన మాట్లాడుతూ.. "సినిమాకు సంబంధించిన తుది దశ పనులు ఇంకా పూర్తి కాలేదు. మరో రెండు, మూడు పాటల చిత్రీకరణతో పాటు, కొన్ని కీలక సన్నివేశాల షూటింగ్ కూడా మిగిలి ఉంది. వీటికి తోడు ప్రచార కార్యక్రమాలను కూడా ప్రారంభించాల్సి ఉంది.

ఈ పనులన్నీ పూర్తి చేయడానికి కనీసం రెండు నుంచి మూడు వారాల సమయం పడుతుంది.. సోషల్ మీడియాలో ఎవరూ వేలెత్తి చూపకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నాం" అని తెలిపారు. నిర్ణయించిన తేదీకే విడుదల చేయాలనే తొందరలో నాణ్యతతో రాజీ పడలేమని నాగవంశీ పేర్కొన్నారు. "ప్రేక్షకులతో పాటు మేం కూడా థియేటర్‌లో సినిమా ఫైనల్ కాపీ చూడటం మాకు ఇష్టం లేదు. అన్ని హంగులు పూర్తి చేసుకున్న కాపీనే థియేటర్లకు అందిస్తాం. సినిమా నాణ్యతకే మా మొదటి ప్రాధాన్యత. అందుకే పూర్తి సంతృప్తిగా అన్ని పనులు ముగించుకుని, కొత్త విడుదల తేదీని ప్రకటిస్తాం" అని ఆయన వివరించారు. ప్రస్తుతం చిత్ర బృందం మిగిలి ఉన్న పనులను వేగంగా పూర్తి చేసే పనిలో నిమగ్నమైంది. అయితే పరిశ్రమ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రాన్ని అక్టోబర్ 30న విడుదల చేసే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. మొత్తానికి, భారీ అంచనాలతో ఎదురుచూస్తున్న ఈ సినిమా కోసం అభిమానులు మరికొంత కాలం వేచి చూడక తప్పదు.

# లైంగిక దాడికి తక్కువేం కాదు

## ఏఐ వీడియోపై జాన్వీకపూర్ రియాక్షన్ ఇదే..!



దేవర సినిమాలోని సూపర్‌హిట్ సాంగ్ 'చుట్టమల్లే' పై సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఏఐ మార్ఫింగ్ వీడియో ఇండస్ట్రీలో టాక్ ఆఫ్‌ది టౌన్‌గా మారిన విషయం తెలిసిందే. ఈ సాంగ్‌లో జాన్వీ కపూర్ కనిపించిన సన్నివేశాలను ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీని ఉపయోగించి అత్యంత అసభ్యకరంగా మార్ఫింగ్ చేయడం పట్ల తారక్‌తోపాటు పలువురు సెలబ్రిటీలు తీవ్ర ఆగ్రహం చేస్తున్నారు. టెక్నాలజీని ఉపయోగించి మహిళలను అభ్యంతరక రీతిలో వారి ప్రమేయం, అనుమతి లేకుండా ఫిక్షనల్ కంటెంట్‌ను వ్యాప్తి చేయడం తీవ్రమైన ఉలంఘున, లైంగిక దాడికి సమానమైన చర్యగా అభిప్రాయపడ్డది. వ్యక్తిగత హద్దులను ఎప్పుడూ గౌరవించాలన్నది. ఒక మహిళ ఏం ధరించినా లేదా ఆమె ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నా సరే.. అంటే ఆమె వరుసగా 5 రోజులు అవునని చెప్పి, ఆరో రోజు కాదని చెప్పినా.. ఆ కాదని చెప్పిన విషయాన్ని గౌరవించాలంది. తాను ఎదుర్కొంటున్న ఏఐ వీడియోలకే ఈ సమస్య పరిమితం కాదని, మహిళలు ప్రతీ రోజూ ఎదుర్కొంటున్న విమర్శలు, భద్రతకు సంబంధించిన ఆందోళనలాంటి వాస్తవ పరిస్థితిని ప్రతిబింబిస్తుందని పేర్కొంది. ఏఐ వీడియో విషయంలో సీరియస్‌గా స్పందించడం పట్ల జాన్వీకపూర్ జూనియర్ ఎన్టీఆర్ కు కృతజ్ఞతలు తెలియజేసింది.

ఈ వ్యవహారానికి వ్యతిరేకంగా గళం విప్పిన చిరంజీవి, విజయ్ ఖుష్బులను అభినందించిన జాన్వీకపూర్.. "ఆమె శరీరం.. ఆమె ప్రతిబింబం, ఆమె హద్దులు.. ఆమె చాయిస్.." అంటూ తన స్టేట్‌మెంట్‌ను ముగించింది. ఈ క్రమంలో జాన్వీ కపూర్ AI వీడియోపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు నమోదు చేశారు. ఏఐ మార్ఫింగ్ వీడియోల వెనుకున్నదెవరు, ఎక్కడి నుంచి వచ్చాయనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నట్టు సమాచారం.

# ఆ దాడులకు నాకు సంబంధం లేదు

## - ఐటీ సోదాలపై రకుల్ ప్రీత్ సింగ్ ఫైర్!



తన పేరును ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ సోదాలతో ముడిపెడుతూ వస్తున్న వార్తలపై బాలీవుడ్ నటి రకుల్ ప్రీత్ సింగ్ తీవ్రంగా స్పందించారు. సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, ఆ సోదాలకు తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. వాస్తవాలను నిర్ధారించుకోకుండా కొన్ని మీడియా సంస్థలు, ఆన్‌లైన్ రిపోర్టర్లు వార్తలను సంచలనం చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "కొందరు ఆన్‌లైన్ రిపోర్టర్లు, కొన్ని ప్రధాన మీడియా సంస్థల్లో వాస్తవాలను నిర్ధారించుకోకుండా వార్తలను సంచలనం చేసే ధోరణి పెరుగుతుండటం బాధాకరం. అందుకే ఒకేసారి అందరికీ స్పష్టత ఇవ్వాలనుకుంటున్నాను. ఆ సోదాలు నాకు సంబంధించినవి కావు" అని రకుల్ తన ప్రకటనలో పేర్కొన్నారు. తన నేపథ్యం గురించి వివరిస్తూ.. "నేను ఆర్మీ కుటుంబం నుంచి వచ్చాను. ఇండస్ట్రీలో నాకు ఎలాంటి గాడ్‌ఫాదర్ లేరు. కేవలం నా కష్టంతోనే ఈ స్థాయికి వచ్చాను. చట్టాన్ని గౌరవించే పౌరురాలిగా 20 ఏళ్ల వయసు నుంచే క్రమం తప్పకుండా పన్నులు చెల్లిస్తున్నాను" అని ఆమె తెలిపారు. ఆర్థిక అవకతవకల ఆరోపణలను కూడా ఆమె ఖండించారు. "వ్యక్తిగతంగా గానీ, ఏ నిర్మాణ సంస్థ తరఫున గానీ నేను ఎలాంటి అక్రమ విదేశీ లావాదేవీలలో పాలుపంచుకోలేదు. దేశంలో లేదా విదేశాల్లో ఎవరి పేరు మీద కూడా నేను బినామీ ఆస్తులు కలిగి లేను. నాకు ఎవరూ ఎప్పుడూ ఎలాంటి ఆస్తులను బహుమతిగా ఇవ్వలేదు. అలాంటి ఖరీదైన బహుమతులు తీసుకోకూడదన్నది నా నియమం" అని రకుల్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మీడియా తీరుపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. "నా గురించి తప్పుడు, దురుద్దేశపూర్వక కథనాలు ప్రచురించిన వారందరూ వాటిని వెనక్కి తీసుకుని, వాస్తవాలను స్పష్టం చేయాలని కోరుతున్నాను. మీడియా వ్యాపారంలో ఎంత పెద్ద సంస్థకైనా ఆర్థిక ఒత్తిళ్లు ఉంటాయని నేను అర్థం చేసుకోగలను. కానీ అది వాస్తవాలను పణంగా పెట్టి జరగకూడదు. ఒకరి ప్రతిష్ఠ, జీవనోపాధిని దెబ్బతీసేలా అసలే ఉండకూడదు" అని ఆమె హితవు పలికారు. కాగా, ముంబైలో నటి రకుల్ ప్రీత్ సింగ్, ఆమె మామ, సినీ నిర్మాత వాషు భగ్నానీ, పనోరమా స్టూడియోస్‌కు సంబంధించిన పలు ప్రాంతాల్లో ఆదాయపు పన్ను శాఖ సోదాలు నిర్వహించినట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. ఆర్థిక అవకతవకల ఆరోపణలపై ముంబై ఐటీ విభాగం సుమారు 12 ప్రాంతాల్లో ఈ తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. సినిమా ఫైనాన్సింగ్ పేరుతో నిధులను అక్రమంగా విదేశాలకు తరలించారన్న ఆరోపణలపై ఈ దర్యాప్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది.



# మూడు బ్రేకప్స్,ఆసుపత్రి వరకు వెళ్లా..

ప్రముఖ నటి సురేఖ వాణి కూతురిగా సినీ ప్రేక్షకులకు పరిచయమైన సుప్రీత.. తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నం చేస్తోంది. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే ఆమె.. టీవీ కార్యక్రమాలతోనూ సందడి చేస్తోంది. మరోవైపు హీరోయిన్‌గా సినిమాలు చేస్తూ అలరించే ప్రయత్నాలు చేస్తుంది . ఈ క్రమంలో తాజాగా ఓ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు విషయాలను సుప్రీత వెల్లడించింది.

తన జీవితంలో ఇప్పటివరకు మూడు బ్రేకప్స్ జరిగాయని సుప్రీత తెలిపింది. అయితే మొదటి ప్రేమను పెద్దగా సీరియస్‌గా తీసుకోనని చెప్పింది. చిన్నతనంలో కలిగిన క్రష్ లాంటిదని, దాన్ని పెద్ద లెక్కలోకి తీసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొంది. కానీ రెండో ప్రేమ మాత్రం తన జీవితంపై తీవ్ర ప్రభావం చూపించిందని సుప్రీత చెప్పింది. దాదాపు రెండున్నరేళ్ల పాటు కొనసాగిన ఆ బంధం తనకు ఎంతో ట్రామాను మిగిల్చిందని వెల్లడించింది. ఆ సంబంధం నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా దాని ప్రభావం వెంటాడిందని చెప్పింది. రెండో రిలేషన్‌షిప్ కారణంగా తనకు తీవ్రంగా భయపడే పరిస్థితి ఏర్పడిందని సుప్రీత తెలిపింది. ముఖ్యంగా ఎక్కువ మంది జనాలు ఉన్నప్పుడు కంగారుగా అనిపించేదని, ఇప్పటికీ అందుకు సంబంధించిన మందులు వాడుతున్నానని చెప్పింది.

ఆ సమయంలో ఎదురైన మానసిక ఒత్తిడి తన మూడో రిలేషన్‌షిప్‌పైనా ప్రభావం చూపించిందని వివరించింది. మూడో రిలేషన్‌షిప్ మొదట్లో బాగానే ఉన్నప్పటికీ.. ఆ బంధం ముగిసిన తీరు తనను తీవ్రంగా బాధించిందని సుప్రీత పేర్కొంది. తాను మారడానికి ప్రయత్నించినప్పటికీ.. తన భాగస్వామిలో ఎక్కువగా కనిపించిన అనుమానం, ఈగో వంటి విషయాలు ఇబ్బంది పెట్టాయని చెప్పింది. తాను షూటింగ్‌లో ఉన్నప్పుడు ఎవరితో మాట్లాడుతున్నావు? ఎందుకు మాట్లాడుతున్నావు? అంటూ ప్రశ్నలు ఎదురయ్యేవని సుప్రీత తెలిపింది. ఇలాంటి అనుమానాలు, నియంత్రించే ప్రయత్నాలు తనకు చాలా ఇబ్బందిగా అనిపించాయని చెప్పింది. ప్రేమలో తాను చాలా బాధపడ్డానని, చివరికి ఆ బంధం తన కెరీర్‌పైనా ప్రభావం చూపడంతో దాని నుంచి బయటకు రావాలని నిర్ణయించుకున్నానని వెల్లడించింది. వరుస బ్రేకప్స్ తనపై తీవ్ర ప్రభావం చూపించాయని సుప్రీత తెలిపింది. ఎక్కువగా ఏడవడం, అతిగా ఆలోచించడం వంటి సమస్యలు వచ్చాయని చెప్పింది. ఆ అనుభవాల నుంచి బయటపడాలని ప్రయత్నించినప్పటికీ.. అప్పుడప్పుడు గతం గుర్తొచ్చేదని పేర్కొంది. బ్రేకప్ కారణంగా తన బరువు కూడా గణనీయంగా తగ్గిపోయిందని సుప్రీత చెప్పింది.

## జిల్లాలో పత్తి కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేసి, రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

### అదనపు కలెక్టర్ నగేష్



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) పత్తి కొనుగోళ్లపై సోమవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో వ్యాపారులు సీసీఐ వ్యవసాయ, మార్కెటింగ్, పోలీస్, ఫైర్,లీగల్ మెట్రాలజీ శాఖల అధి కారులతో సన్నాహక సమావేశం అదనపు కలెక్టర్ నగేష్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిన్నింగ్ మిల్లుల వివరాలను యాప్‌లో నమోదు చేసి, రైతులను సంబంధిత మిల్లులకు ట్యాగింగ్ చేసే ప్రక్రియ పూర్తిచేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, నీడ, తూకం తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. మాయిశ్చర్ మీటర్లను సక్రమంగా వినియోగించేలా ఏ ఈ ఓ లు, గ్రేడర్లు, సీసీఐ సిబ్బందికి ప్రత్యేక శిక్షణనందించాలని సూచించా రు. ప్రతీకొనుగోలు కేంద్రంలో హెల్ప్‌డెస్క్ ఏర్పా టు చేయాలన్నారు. ఈ సంవత్సరం ప్రభుత్వ కనీస మద్దతు ధర 8,667 ప్రకటించిన జరిగిందని మెదక్ జిల్లాలో 39వేల 940 ఎకరాల పత్తి సాగు చేశారని,03 లక్షల 95,280 క్వింటాళ్ల పత్తి వచ్చే అవకాశం ఉందని అదే మారుగా ఏ ఈ ఓ లు రైతుల నుంచి గుర్తించిన వారికి కాపాస్ కిసాన్ యాప్ లో వారి పంట వివరాలను పొందుపరచాలని ఆ తర్వాత రైతులు ఏ రోజు అయితే స్లాట్ బుక్ చేసుకుంటారో అదే రోజు పత్తి అమ్మకానికి తీసుకొచ్చే విధంగా చూడాలని వ్యవసాయ అధికారినీ ఆదేశించారు. తూనికల కొలతల అధికారులు వే బ్రిడ్జి మరియు వేయింగ్ స్కేల్ తూకంలో వ్యత్యాసాలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో జిన్నింగ్ మిల్ మరియు గోదాముల వద్ద నీటి వసతులు ఉన్నాయా , లేదా మరియు ఫైర్ పరికరాలు తనిఖీ చేయాలనే ఆదేశించారు రైతులు తమ పంటను పత్తి మార్కెట్ యార్డు మరియు జిన్నింగ్ మిల్స్ కు వచ్చినప్పుడు తేమ శాతం లేకుండా ఆరబెట్టుకుని ట్రాక్టర్లలో గాని డీసీఎంలలో గాని లేదా లారీలలో గాని పత్తిని తీసుకొని వచ్చేటప్పుడు నిబంధనలు పాటించి. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలని తెలిపారు. సమావేశంలో రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్ రావు, జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్,మార్కెటింగ్ అధికారి బాలరాజు, తునికల కొలతల శాఖల అధికారి , అగ్నిమాపక శాఖ అధికారి వేణు, డీఎస్పీ ప్రసన్నకుమార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణ - ఓటు హక్కు పరిరక్షణ కోసం ఇండియా కూటమి ఉద్యమం

### డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏఐసీసీ మరియు పీసీసీ అధ్యక్షుల ఆదేశాల మేరకు మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు పరిరక్షణతో పాటు ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన ప్రజా సమస్యలపై చర్చించారు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ హక్కులు మరియు ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడేందుకు చేపట్టాల్సిన తదుపరి కార్యక్రమాలపై నాయకులతో సమగ్రంగా చర్చించారు.ఈ సందర్భంగా రేపు, 06-10-2026 మంగళవారం ఉదయం 10:00 గంటలకు "చలో కలెక్టరేట్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ఇండియా కూటమి నేతలు, మెదక్ మున్సిపల్ చైర్మన్ రాధిక, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, పట్టణ అధ్యక్షులు గంగాధర్, సిపిఐ కార్యదర్శి మల్లేష్,కౌన్సిలర్స్, అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొనారు.

## లో వోల్టేజెస్ సమస్యలు లేకుండా చూడాలి టీజీఎస్పీడీసీఎల్ సిఎండి జితేష్ పాటిల్



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) సోమవారం ఆకస్మిక తనిఖీలో భాగంగా, మెదక్ జిల్లాలోని 132/33 కేవ్ కౌడిపల్లి సబ్ స్టేషన్ లో వోల్టేజెస్ లోడ్స్ ని సీఎండీ జితేష్ పాటిల్ పరిశీలించారు. కూల్చారం లో వరి పొలాలని పరిశీలించి పోచయ్య, రాములు రైతులతో సమస్యని అడిగి తెలుసుకొన్నారు. వారికి పంట మార్పిడి అవశ్యకత గురించి వివరించారు. అక్కడి నుండి అంసనపల్లి సబ్స్టేషన్ ను పరిశీలించడం జరిగింది మరియు చాలా సేపు విద్యుత్ అంతరాయాల 11ఖఎ ఫీడర్ గురించి గురించి విద్యుత్ అధికారులను/కొల్చారం లైన్మెన్ తో మాట్లాడి తగిన పరిష్కారం తెలిపారు. తదుపరి అంసనపల్లి సర్పంచ్ తండా సర్పంచ్ శ్రీ జానకిరామ్ రెడ్డి తో మాట్లాడారు. వారు అంసనపల్లి కి సెపరేట్ 11ఎజ కావాలని అడిగారు. అనంతరం 220/132/33 KVb మీనూర్ ఎహెట్ సబ్ స్టేషన్ ను పరిశీలించారు నిన్న ఓల్టీసీ ప్రాబ్లం వచ్చిన 160వీఖా పవర్ ట్రాన్స్ఫార్మర్ ని అక్కడున్న ADE/ట్రాన్స్కో తో మాట్లాడి తెలుసుకున్నారు. అక్కడి నుండి పాపన్నపేట లో వరి పొలాలని పరిశీలించారు, అక్కడున్న రైతులు బైండ్ల అశోక్, సిద్ధిరాం రెడ్డి, యాదగిరి సిద్ధిరాములు గార్లతో వరి పొలం పంట గురించి మరియు లాభనష్టాల గురించి వివరంగా మాట్లాడారు, వరికీ బదులు, కూరగాయలు, పండ్ల మొక్కలు, పూల తోటలు మొదలగునవి వేసుకొనచో వచ్చే లాభాల గురించి రైతులకు స్పష్టంగా తెలియజేశారు.దీనికి తోడు ఒక గుంట భూమిలో కోర్రమీను చేపలను పెంచడం, మేకలను పెంచి అమ్ముకోవటం వల్ల వరి పంట కంటే చాలా ఎక్కువ లాభాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి అని మన జవీణ గారు తెలిపారు. దానికి రైతులు చాలా ఆనందంగా విని ఈ సారి అలాగే చేస్తామని చెప్పారు. సీఎండీ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాల స్వామి CE/OP/Rural జోన్, నారాయణ నాయక్ SE/OP/మెదక్, రామేశ్వర స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేస్తాం



శ్రీకాళహస్తి (ప్రశ్న న్యూస్) రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ సత్తా చాటాలని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం మండల విస్తృత స్థాయి సమావేశం ఆయన అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఐడీ కార్డులను పంపిణీ చేశారు.ప్రతి వార్డు, గ్రామంలో ప్రజాదరణ కలిగిన అభ్యర్థులను ఎంపిక చేసి వారి విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వ బెదిరింపులకు కార్యకర్తలు భయపడాల్సిన అవసరం లేదని, పార్టీ శ్రేణులకు తాను అండగా ఉంటానని తెలిపారు.ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. జగనన్న హయాంలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. 2029 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవడమే లక్ష్యమని పేర్కొన్నారు కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు బ్రి సుదర్శనరెడ్డి, మండల అధ్యక్షుడు చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, చెలికం నాగరాజురెడ్డి, రంగినేని చెంచయ్యనాయుడు, యుగంధర్‌రెడ్డి కందాటి, సురేంద్రయాదవ్, గంగిరెడ్డి,భానుమూర్తి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గురుదాస్ కామత్ జీ జయంతి వేడుకలు



శ్రీకాళహస్తి( ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ ,నిత్యావసర సరుకుల పంపిణీ శ్రీకాళహస్తి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ దివంగత మాజీ కేంద్ర మంత్రి, సీనియర్ నాయకులు గురుదాస్ కామత్ జీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ షేక్ కరీముల్లా ఆధ్వర్యంలో, తిరుపతి జిల్లా క్రిస్టియన్ మైనారిటీ నాయకులు కె.సి. ప్రేమసుందరం అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గురుదాస్ కామత్ జీ చిత్రపటానికి నివాళులర్పించి, కేక్ కట్ చేసి జయంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఎస్సీ సెల్ నాయకులు ఎన్. బత్తయ్య, పాస్టర్ సోదరులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.గురుదాస్ కామత్ జీ సేవలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో సామాజిక సేవా కార్యక్రమంగా నిత్యావసర సరుకుల పంపిణీ చేపట్టారు.

## మూగబోయిన ప్రజావాణి




ధర్పల్లి(ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం గతంలో జిల్లా కేంద్రంలోనే ఉండేది.రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదలకు అందుబాటులో ఉండాలని మండల స్థాయిలో నిర్వహిస్తోంది.అయితే ధర్పల్లిలో సోమవారం జరిగిన



ప్రజావాణిలో 12 గంటల వరకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు.సుమారు 20 మంది ప్రభుత్వ అధికారులు మధ్యాహ్నం ఒంటిగంట వరకు తమ విధులను పక్కనపెట్టి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శాంత,ఎంపీడీవో మారుతి , ఏవో వెంకటేష్,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జనసేనలో సత్రావాడ ప్రవీణ్‌కు సన్మానం



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరిన సత్రావాడ ప్రవీణ్‌ను పానగల్‌లోని ఆయన కార్యాలయంలో జనసేన నాయకులు, కార్యకర్తలు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ. ప్రవీణ్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి తమవంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ప్రజల సహాయ సహకారాలతో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జనసేన పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో కొత్వాల కిరణ్‌రాయల్, కొత్తపేట సాయి, కళ్యాణ్‌రామ్, సుజిత్ యాదవ్, ఎస్.కె. రెహమాన్, కిరణ్ యాదవ్, సంతోష్‌కుమార్ యాదవ్, అరుణ్‌రాయల్, కిషోర్‌రెడ్డి, చైతన్య, మౌళి, జగదీష్, ఈశ్వర్, తేజ, మోక్ష తదితర జనసేన నాయకులు పాల్గొన్నారు.

## ధర్పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో జాతీయ సేవా పథకం




ధర్పల్లి (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వారి ఆధ్వర్యంలోని జాతీయ సేవా పథకం వారి నేతృత్వంలో మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో,ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్లాస్టిక్ పేపర్లను ఒక దగ్గర చేర్చి పరిశుభ్రంగా ఉండాలని ప్రజలకు సూచించడం జరిగింది.అలాగే పరిసరాలలోని పిచ్చి మొక్కలను ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మార్చడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ జ్యోతి మేడం మాట్లాడుతూ పరిశుభ్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచినప్పుడే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలమని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అయిన స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం కుమారస్వామి మాట్లాడుతూ ప్రజలలో పరిశుభ్రత ఆరోగ్యకరమైన వాతావరణంపై అవగాహన కల్పించడంతోపాటు యువతలో సామాజిక బాధ్యతను పెంపొందించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య లక్షణం తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎన్ కుమారస్వామి నెంబర్ డాక్టర్ సిహెచ్ రామచందర్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ మొదలైన వారు పాల్గొనడం జరిగింది.

## పురుషుల టాయిలెట్‌లో మహిళా సిబ్బంది.






శ్రీకాళహస్తి ( ప్రశ్న న్యూస్) దేవస్థానం నిర్వహణపై విమర్శలు శ్రీకాళహస్తి ప్రముఖ వాయులింగ క్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థానంలో పారిశుద్ధ్య నిర్వహణ తీరు మరోసారి విమర్శలకు దారితీసింది. ఆలయ పరిపాలన భవనం ఎదుట, త్రినేత్ర అతిధి గృహం సమీపంలోని పురుషుల మరుగుదొడ్డిలో మహిళా పారిశుద్ధ్య సిబ్బందితో శుభ్రత పనులు చేయిస్తున్న పరిస్థితి భక్తుల్లో అసంతృప్తికి కారణమవుతోంది. మహిళా సిబ్బంది మరుగుదొడ్డిని శుభ్రపరుస్తున్న సమయంలోనే పురుషులు అక్కడికి వెళ్లి మూత్ర విసర్జన చేయాల్సి రావడం పట్ల పలువురు ప్రశ్నిస్తున్నారు. పర్యవేక్షకులు ఉన్నా పట్టింపు లేదా. దేవస్థానంలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించేందుకు సిబ్బంది, సూపర్వైజర్లు ఉన్నప్పటికీ ఇలాంటి పరిస్థితి ఎలా ఏర్పడిందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మహిళా సిబ్బంది పురుషుల మరుగుదొడ్డిలో పనిచేస్తున్న సమయంలో కనీసం కొద్దిసేపు పురుషుల ప్రవేశాన్ని నిలిపివేయడం, ప్రత్యామ్నాయ మరుగుదొడ్డిని చూపించడం లేదా పురుష సిబ్బందితో శుభ్రత పనులు చేయించడం వంటి సాధారణ చర్యలు కూడా చేపట్టకపోవడం అధికారుల పర్యవేక్షణ తీరుపై అనుమానాలకు తావిస్తోంది.భక్తుల అసౌకర్యం పట్టదా దేశం నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చే ప్రముఖ పుణ్యక్షేత్రంలో పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉండగా, ఇలాంటి అసౌకర్యకర పరిస్థితులు నెలకొనడం ఏమిటని భక్తులు నిలదీస్తున్నారు. మహిళా పారిశుద్ధ్య సిబ్బంది గౌరవం, భద్రతను దృష్టిలో పెట్టుకోవడంతో పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులను సమన్వయం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొంటున్నారు.ఇకనైనా అధికారులు స్పందిస్తారా.దేవస్థానంలో నిత్యం ఏదో ఒక అంశంపై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో కనీస పారిశుద్ధ్య నిర్వహణలోనూ నిర్లక్ష్యం కనిపిస్తే బాధ్యత ఎవరిదని భక్తులు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పురుషులు, మహిళల మరుగుదొడ్లలో శుభ్రత పనులకు స్పష్టమైన విధివిధానాలు రూపొందించి, పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని భక్తులు కోరుతున్నారు.

## ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలి

### మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ తో కలిసి కలెక్టర్ అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీ రాజ్, సివిల్ సప్లైస్, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించి మొత్తం 110 దరఖాస్తులు ప్రజల నుండి స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితుల సమస్యలకు ప్రాధాన్యతనిచ్చి వేగంగా పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టరు సూచించారు.ఈ సమావేశంలో డిఆర్ఓ మాలతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జనరిక్ మందుల నాణ్యతపై అపోహలు వద్దు

- బ్రాండెడ్ మందులతో సమానంగా ప్రభావం చూపుతాయి
- బ్రాండెడ్ మందులు జనరిక్ మందులు ఒకే ఫార్ములాతో తయారు చేయబడతాయి
- బ్రాండెడ్ మందుల కంపెనీల పేటెంట్ ముగిసిన వెంటనే జనరిక్ మందులుగా మార్కెట్లోకి విడుదల చేస్తారు
- బ్రాండెడ్ మందులతో పోల్చుకుంటే జనరిక్ మందులు 50 - 80 శాతం చౌకగా లభిస్తాయి.

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బ్రాండెడ్ మందులతో పోల్చుకుంటే జనరిక్ మందుల్లో నాణ్యత తక్కువగా ఉంటుందనే అపోహ బలంగా పేరుకుపోయింది. జనరిక్ మందుల పట్ల అవగాహన లోపమే దీనికి కారణం. అయితే జనరిక్ మందులు కూడా బ్రాండెడ్ మందులతో సమానంగా ప్రభావాన్ని చూపుతాయి. పేరు మాత్రమే వేరు కాని తయారీ ఫార్ములా మాత్రం ఒకటే. బ్రాండెడ్ మందుల ధరలకన్న జనరిక్ మందులు తక్కువ ధరకు అందుబాటులో ఉంటాయి కాబట్టి అవి సరిగా పని చేస్తాయో లేదోననే సంశయంలో ప్రజలు జనరిక్ మందుల వైపు మొగ్గు మొగ్గుచూపడం లేదు. అలాగే జనరిక్ మందులపై డాక్టర్లు కూడా అధరణ చూపడం లేదనే వాదన ఉంది. అయితే కొందరు డాక్టర్లు మాత్రం జనరిక్ మందుల వైపు మొగ్గు చూపుతు తమ వద్దకు వచ్చే రోగులకు జనరిక్ మందులతో వైద్యం అందిస్తున్నారు. అయితే రెండు మూడు రోజులు మాత్రమే వాడే చికిత్సకు బ్రాండెడ్ మందులు కొన్నా పర్లేదు కాని నెలల తరబడి మందులు వాడాల్సిన దీర్ఘకాలిక రోగాలకు మందులు వాడే వారు మాత్రం జనరిక్ కొనడమే ఉత్తమమని పలువురు వైద్యులు తెలుపుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికి మందుల ఖర్చు నెలకి వేయికి పైనే అవుతున్న తరుణంలో జనరిక్ మందులపై దృష్టి పెడితే మందుల కోసం చేసే ఖర్చు చాలా వరకు తగ్గనుందని వైద్యులు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

### బ్రాండెడ్ మందులు..

ఒక కొత్త మందును కనుగొనడానికి ఫార్మా కంపెనీలు అనేక పరిశోధనలు, పరీక్షలు చేసి మందును మార్కెట్ లోకి తీసుకొస్తాయి. అందుకు ప్రతిఫలంగా ఆ మందు తయారీ పై కంపెనీకి 20 సంవత్సరాల కాలం పాటు పేటెంట్ హక్కులు లబిస్తాయి. అలా తయారు చేసిన మందులను బ్రాండెడ్ డ్రగ్స్ లేదా స్టాండర్డ్ డ్రగ్స్ అంటారు. ఆ మందు యొక్క ఫార్ములా తెలిసినా ఏ ఫార్మా కంపెనీ అయినా సరే, దానిని పేటెంట్ ఉన్న కాలంలో పెటెంట్ పొందిన కంపెనీ అనుమతి లేకుండా ఆ మందు తయారు చేయకూడదనే నిబంధన ఉంటుంది. అలా పేటెంట్ లో ఉన్న మందులను ఇతరులు ఎవరైనా తయారు చేసి అమ్మితే వారు శిక్షార్హులౌతారు. అంటే ఆ మందుపై, మొట్ట మొదట తయారు చేసిన కంపెనీకే 20 సంవత్సరాల పాటు ఆదిపత్యం ఉంటుంది. నిజానికి ఆ మందును తయారు చేయడానికి అయ్యే ఖర్చుకు, ఆ మందుపై కంపెనీ వసూలు చేసే అమ్మకపు ధరకు ఏ మాత్రం పొంతన ఉండదు. తయారీ ఖర్చు కంటే మందు యొక్క అమ్మకపు ధర అనేక రెట్లు అధికంగా ఉంటుందని సమాచారం.

### ఎందుకింత తేడా..

ఒక కొత్త రకం మందు తయారీ కోసం పరిశోధనలు, క్షేత్ర స్థాయి పరీక్షల నిమిత్తం చాలా డబ్బు ఖర్చు చేయాల్సి వచ్చిందని కంపెనీలు వెల్లడించడంతో 20 సంవత్సరాల పాటు ఆ మందుపై, దానిని తయారు చేసిన కంపెనీకి పేటెంట్ హక్కులు కల్పించి, పెట్టుబడి సొమ్మును రాబట్టుకోడానికి, ఆ మందును మొట్టమొదట తయారు చేసిన కంపెనీకి ప్రభుత్వం అవకాశం కల్పిస్తుంది.
అయితే ముఖ్యంగా బ్రాండెడ్ మందుల ధరతో పోల్చుకుంటే జనరిక్ మందుల ధరలు తక్కువగా ఉండటానికి కారణం మందులపై ప్రకటనలు ఉండకపోవడం, వీటి కోసం ఎలాంటి ప్రచారాలు, ప్రకటనల ఖర్చులు లేకపోవడం, కొత్తగా పరిశోధనలతో మందుల ఫార్ములా చేసే అవసరం లేదు, మందుల తయారు చేసే మొదటి దశ ఖర్చు జనరిక్ మందులకు ఉండదు. ఆకర్షణీయమైన ప్యాకింగ్ ఖర్చులు వీటికి ఉండక పోవడం వల్ల జనరిక్ మందుల ధరలు తక్కువగా ఉంటాయి.

### పేద ప్రజలకు ప్రయోజనకరం..



తక్కువ ఖర్చుతో నాణ్యమైన చికిత్స పొందడానికి జనరిక్ మందులు ఎంతగానో దోహదపడతాయి. జనరిక్ మందులు చవకగా లభిస్తుడటంతో వాటి నాణ్యత కూడా తక్కువగా ఉంటుందనే కేవలం అపోహ మాత్రమే. ప్రభుత్వ ఔషధ నియంత్రణ సంస్థ నిబంధనల ప్రకారం, బ్రాండెడ్ మందులు ఎంత ప్రభావవంతంగా పనిచేస్తాయో జనరిక్ మందులు కూడా అంతే వేగంగా పనిచేస్తు సమాన ఫలితాన్ని ఇస్తుందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. ముఖ్యంగా డయాబెటిస్, రక్తపోటు, గుండె సమస్యలు, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో నిరంతరం మందులు వాడాల్సిన రోగులకు జనరిక్ మందులు గొప్ప వరం లాంటివి. జనరిక్ మందులు వాటి తయారీ, నాణ్యతపై

# జలధారకు పైలాన్ ఆవిష్కరణ



ప్రొద్దుటూరు(ప్రశ్న న్యూస్) జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధారలో భాగంగా రూ.30,156 కోట్లతో చేపడుతున్న తాగునీటి ప్రాజెక్టుల వివరాలతో ప్రొద్దుటూరులోని అమృత్‌నగర్ కూడలిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పైలాన్‌ను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆవిష్కరించారు.
రాష్ట్రంలోని 28 జిల్లాల్లో చేపడుతున్న పనులు, దాదాపు 9 వేల గ్రామాల్లోని సింగిల్ విలేజ్ స్కీమ్స్, గండికోట జలాశయం నుంచి అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు చేపడుతున్న ప్రాజెక్టుల వివరాలను ఇందులో పొందుపరిచారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నంద్యాల వరదరాజులరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇండియాలో 'ఐఏఎస్ సింగం'

## - ఇప్పుడు న్యూయార్క్‌టైమ్స్‌లో 'రాక్‌స్టార్'!






**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** కఠిన చర్యలతో ఇప్పటికే దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఐఏఎస్ అధికారి తూకారాం ముండే పేరు ఇప్పుడు అంతర్జాతీయ మీడియా వేదికపై మార్మోగింది. మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్‌గా పరిశుభ్రత నిబంధనలు పాటించని రెస్టారెంట్లు, ఫుడ్ స్టోర్లపై కొరడా ఝుళిపిస్తున్న ముండేను 'ది న్యూయార్క్ టైమ్స్' ఏకంగా 'రాక్‌స్టార్'గా అభివర్ణించింది. ఆ పత్రిక ఫ్రంట్ పేజీలోనే ఆయనపై ప్రత్యేక కథనం ప్రచురించడం విశేషం. న్యూయార్క్ టైమ్స్ "ఇన్ ఇండియా, ఏ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఈజ్ ఏ రాక్‌స్టార్" అనే శీర్షికతో ముండేపై కథనం ప్రచురించింది. "డైనర్స్ రెవర్ హిమ్ అండ్ ఓనర్స్ ఫియర్ హిమ్" అంటూ ఆయనకు వినియోగదారుల్లో ఉన్న అభిమానాన్ని, రెస్టారెంట్ యజమానుల్లో ఉన్న భయాన్ని ప్రస్తావించింది. వెబ్ కథనంలో ఆయన్ను 'ఫుడ్ సేఫ్టీ సెలబ్రిటీ'గా పేర్కొంది.ఆకస్మిక తనిఖీలతో ముండే ఇప్పటికే దేశంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. రెస్టారెంట్లు, ఫుడ్ షాపులు, గోదాములు, క్విక్ కామర్స్ డార్క్ స్టోర్లలో తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలపై చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఆయనకు 'ఐఏఎస్ సింగం' అనే పేరు కూడా వచ్చింది. 'డామినోస్', 'పిజ్జా హట్' ఔట్‌లెట్లలో తనిఖీల సందర్భంగా వంటగదుల్లో బొద్దింకలు, గడువు ముగిసిన ఉత్పత్తులు గుర్తించడంతో వాటిని తాత్కాలికంగా మూసివేశారు. ముంబయిలోని కొన్ని ప్రముఖ పాతకాలపు ఫుడ్ బిజినెస్‌ల లైసెన్సులపైనా తాత్కాలిక సస్పెన్షన్ వేటు పడింది.క్విక్ కామర్స్ సంస్థలు బ్లింకిట్, జెప్టోకు చెందిన డార్క్ స్టోర్లలోనూ తనిఖీలు జరిగాయి. అక్కడ బల్లులు, బొద్దింకలు, గడువు ముగిసిన ఆహార పదార్థాలు ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు కథనాలు వెలువడ్డాయి. రెస్టారెంట్ యజమానులపై చర్యలు తీసుకుంటున్న ముండే.. పరిశుభ్రమైన ఆహారం కోరుకునే వినియోగదారుల్లో మాత్రం ప్రత్యేక అభిమానాన్ని సంపాదించుకున్నారు. ఇప్పుడు ఆ గుర్తింపే అంతర్జాతీయ స్థాయికి చేరింది. భారత్‌లో 'ఐఏఎస్ సింగం'గా పేరొందిన ఆయనను న్యూయార్క్ టైమ్స్ 'రాక్‌స్టార్'గా అభివర్ణించడం ఆసక్తికరంగా మారింది.

# ఎయిమ్స్‌లో ఓపీ కష్టాలు

## -పేషెంట్లకు నరకయాతన

- వైద్యం కోసం వస్తే ఓపీ క్యూలోనే ఓపిక నశించే పరిస్థితి
- గంటల తరబడి నిరీక్షణపై పేషెంట్ల ఆవేదన
- సమాచారం కోసం కౌంటర్ల చుట్టూ ప్రదక్షిణలు
- వృద్ధులు, మహిళలు, దూర ప్రాంతాల రోగుల అవస్థలు






మంగళగిరి (ప్రశ్న న్యూస్) దేశంలో అత్యున్నత వైద్య సంస్థల్లో ఒకటిగా పేరొందిన ఎయిమ్స్‌కు మెరుగైన వైద్యం అందుతుందన్న నమ్మకంతో ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో పేషెంట్లు వస్తుంటారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎయిమ్స్ వైద్యం ఒక ఆశాకిరణంగా మారింది. అయితే ఆసుపత్రికి వచ్చిన తర్వాత ఓపీ సేవల కోసం చాలా సమయం వరకు ఎదురుచూడాల్సిన పరిస్థితి కొందరు రోగులకు తీవ్ర ఇబ్బందిగా మారుతోందన్న ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. వైద్యుడిని కలవకముందే ఓపీ క్యూలో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని పేషెంట్లు, వారి బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### వైద్యం కోసం వస్తే.. ఓపీ క్యూలోనే పరీక్ష..

అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు ముందుగా అవసరమయ్యేది వైద్యుడిని త్వరగా కలవడం. అయితే ఓపీ రిజిస్ట్రేషన్, టోకెన్, సంబంధిత విభాగానికి చేరుకోవడం, తమ వంతు కోసం వేచి ఉండటం వంటి దశల్లో చాలా ఎక్కువ సమయం పడుతోందని పేషెంట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం తొందరగా ఆసుపత్రికి చేరుకున్నప్పటికీ ఓపీ ప్రక్రియ పూర్తయ్యే వరకు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందన్న రోగులు మండిపడుతున్నారు.అనారోగ్యంతో ఉన్న వ్యక్తి ఎక్కువసేపు నిలబడాల్సి వస్తే పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతుందని క్యూలో నిలబడలేని పరిస్థితిలో ఉన్న రోగులు ఎక్కడ కూర్చోవాలి.? ఎవరిని సంప్రదించాలి.? తమకు ముందుగా సేవలు అందే అవకాశం ఉందా.? లేదా అనే విషయాల్లో స్పష్టత లేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

### ఓపీ కోసం ఓపిక నశిస్తోంది..

ఓపీ కోసం ఎదురుచూస్తున్న సమయంలోనే పేషెంట్ల సహనం నశించే పరిస్థితి ఉందని పలువురు వాపోతున్నారు. ఒకవైపు అనారోగ్యం.. మరోవైపు గంటల తరబడి నిరీక్షణ.. దీనికి తోడు సరైన సమాచారం అందకపోవడం.. ఇబ్బంది నిర్లక్ష్యం.. సరిపడా సిబ్బందిని కేటాయించకపోవడం ఇవన్నీ కలిసి రోగులకు మరింత మానసిక ఒత్తిడిని కలిగిస్తున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.
ముఖ్యంగా మొదటిసారి ఎయిమ్స్‌కు వచ్చే వారికి ఆసుపత్రి ప్రాంగణంలోని వివిధ విభాగాలు, ఓపీ కౌంటర్లు, టోకెన్ విధానం, వైద్య విభాగాలపై అవగాహన లేకపోవచ్చు. ఇలాంటి వారికి సహాయం చేయాల్సిన వ్యవస్థ ఎంతవరకు సమర్థంగా పనిచేస్తోందన్నది ప్రశ్నగా మారుతోంది.

### సమాచారం కోసం కౌంటర్ల చుట్టూ ప్రదక్షిణలు.?

ఓపీ ఎక్కడ.? టోకెన్ ఎక్కడ తీసుకోవాలి ? ఏ విభాగానికి వెళ్లాలి.? రిపోర్టులు ఎక్కడ చూపించాలి.? తదుపరి ప్రక్రియ ఏమిటి.? అనే సందేహాలకు వెంటనే సమాధానం దొరకక కొందరు రోగులు, వారి బంధువులు ఒక కౌంటర్ నుంచి మరో కౌంటర్‌కు తిరగాల్సి వస్తోందన్న ఫిర్యాదులు ఉన్నాయి.ఆసుపత్రిలో ప్రత్యేక సమాచార కేంద్రం ఉన్నప్పటికీ అది రోగుల అవసరాలకు అనుగుణంగా పనిచేస్తుందా.? రోగి అడిగిన ప్రశ్నకు వెంటనే సమాధానం లభిస్తుందా.? స్థానిక భాషలో సమాచారం అందుబాటులో ఉందా.? అన్న అంశాలపై అధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

### వృద్ధులు, మహిళల పరిస్థితి ఏమిటి.?

ఓపీ క్యూలలో ఎక్కువసేపు వేచి ఉండాల్సిన పరిస్థితి వృద్ధులకు మరింత ఇబ్బందికరంగా మారుతుంది. నడవడానికి ఇబ్బంది ఉన్న వారు, బలహీనంగా ఉన్న వారు, అనారోగ్యంతో ఉన్న మహిళలు, చిన్న పిల్లలతో వచ్చే తల్లులు ఎక్కువసేపు వేచి ఉండాల్సి వస్తే వారి పరిస్థితి మరింత దయనీయంగా మారే అవకాశం ఉంది.ఇలాంటి వారికి ప్రత్యేక క్యూలు, సహాయక సిబ్బంది, వీల్‌చైర్ సౌకర్యం, తగినంత కూర్చునే వసతి వంటి అంశాలపై ఆసుపత్రి అధికారుల ప్రత్యేక శ్రద్ధ అవసరమని రోగుల బంధువులు అభిప్రాయపడుతున్నారు.

### దూర ప్రాంతాల నుంచి వస్తున్న పేషెంట్లకు అదనపు భారం

ఎయిమ్స్‌కు కేవలం స్థానిక ప్రాంతాల నుంచే కాకుండా దూర ప్రాంతాల నుంచి కూడా పేషెంట్లు వస్తుంటారు. తెల్లవారుజామునే బయలుదేరి గంటల ప్రయాణం చేసి ఆసుపత్రికి చేరుకునే రోగులు.. ఇక్కడ మరోసారి ఓపీ కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తే వారి ఇబ్బంది రెట్టింపవుతుంది.ఒక్కరోజు ఓపీ కోసం ప్రయాణ ఖర్చులు, ఆహారం, సహాయకుడి ఖర్చులు భరించాల్సిన పరిస్థితి పేద కుటుంబాలపై అదనపు ఆర్థిక భారాన్ని మోపుతుందని ఓపీ ప్రక్రియ వేగవంతమైతే రోగులకు సమయం, డబ్బు రెండూ ఆదా అయ్యే అవకాశం ఉంటుంది.

### క్యూల నిర్వహణపై ప్రశ్నలు..

రోగుల రద్దీని ముందుగానే అంచనా వేసి అవసరమైనన్ని కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారా.? రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో అదనపు సిబ్బందిని వినియోగిస్తున్నారా.? టోకెన్ విధానాన్ని మరింత సమర్థంగా అమలు చేయవచ్చా.? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో డిజిటల్ టోకెన్, ఎస్ఎంఎస్ సమాచారం, డిస్‌ప్లే బోర్డులు, వేర్వేరు విభాగాలకు ప్రత్యేక మార్గదర్శకాలు వంటి వ్యవస్థలను మరింత సమర్థంగా వినియోగిస్తే రోగుల నిరీక్షణ సమయాన్ని తగ్గించే అవకాశం ఉందని పలువురు సూచిస్తున్నారు.

### రోగి సేవల లక్ష్యం ఎక్కడ.?

అత్యాధునిక వైద్య సదుపాయాలు, నిపుణులైన వైద్యులు, ఆధునిక పరికరాలు ఉన్న ఆసుపత్రిలో రోగి సేవలకు కూడా అంతే ప్రాధాన్యం ఉండాలి. వైద్యం అందించే ముందు రోగి ఆసుపత్రిలో అడుగుపెట్టిన నిమిషం నుంచి అతనికి సరైన మార్గదర్శకత్వం అందడం అత్యంత కీలకం.ఓపీ కౌంటర్ వద్దే రోగి ఇబ్బందులు ఎదుర్కొంటే, వైద్య సేవలపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంటుంది. అందువల్ల ఓపీ ప్రక్రియలో ఎక్కడ సమస్య ఉందో గుర్తించి పరిష్కరించాల్సిన బాధ్యత ఆసుపత్రి యంత్రాంగంపై ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### పేషెంట్లకు కావాల్సింది ఉపన్యాసాలు కాదు.. పరిష్కారం

రోగి ఆసుపత్రికి వచ్చేది తన అనారోగ్యానికి చికిత్స పొందేందుకు. ఓపీ కోసం ఎక్కడ నిలబడాలి, ఎవరిని అడగాలి, ఎప్పుడు తమ వంతు వస్తుంది అనే ఆందోళనలో గంటలు గడపడానికి కాదు. ముఖ్యంగా అనారోగ్యంతో వచ్చిన వ్యక్తికి ఓపిక కూడా ఒక పరిమితి.
అందుకే ఓపీ సేవలపై వచ్చే ఫిర్యాదులను అధికారులు కేవలం సాధారణ సమస్యగా కాకుండా రోగి సౌకర్యానికి సంబంధించిన కీలక అంశంగా పరిగణించాల్సిన అవసరం ఉంది. రద్దీకి అనుగుణంగా కౌంటర్లు పెంచడం, ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయడం, వృద్ధులు,దివ్యాంగులకు ప్రాధాన్యత కల్పించడం, స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం, సిబ్బందికి రోగులతో మర్యాదగా వ్యవహరించేలా మార్గదర్శకాలు ఇవ్వడం వంటి చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని పేషెంట్ల బంధువులు కోరుతున్నారు.

# నాలుగు రోజుల నష్టాలకు బ్రేక్

## - లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు




ముంబై (ప్రశ్న న్యూస్) దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాలతో ముగిశాయి. గత నాలుగు రోజులుగా కొనసాగుతున్న నష్టాల పరంపరకు నేటి ట్రేడింగ్‌తో తెరపడింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు తోడవ్వడం, ఇన్వెస్టర్లలో కొనుగోళ్ల ఆసక్తి పెరగడంతో కీలక సూచీలు లాభాల బాట పట్టాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 472.77 పాయింట్లు (0.66%) లాభంతో 72,382.47 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 133.80 పాయింట్లు (0.6%) పెరిగి 22,555.75 వద్ద ముగిసింది. మార్కెట్ సాంకేతిక అంశాలను విశ్లేషిస్తే, నిఫ్టీ ట్రేడింగ్ సమయంలో 22,580–22,600 పాయింట్ల కీలక స్థాయిని పరీక్షించినప్పటికీ, ముగింపు సమయానికి ఆ స్థాయి దిగువనే నిలిచింది. నిఫ్టీ ఈ నిరోధాన్ని అధిగమిస్తే 22,800 పాయింట్ల వరకు కోలుకునే అవకాశం ఉందని, లేనిపక్షంలో 22,400 స్థాయి వద్ద మద్దతు లభించవచ్చని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.నేటి ట్రేడింగ్‌లో ఐటీసీ, టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ వంటి షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. రంగాల వారీగా పరిశీలిస్తే, నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఎఫ్ఎంసీజీ సూచీలు రాణించాయి. మరోవైపు, హెల్త్‌కేర్, ఫార్మా రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా లాభాల్లోనే ముగియడం గమనార్హం. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తక్షణమే పెంచకపోవచ్చనే అంచనాలతో అంతర్జాతీయ మార్కెట్లలో సెంటిమెంట్ మెరుగుపడింది. దీని ప్రభావం దేశీయ మార్కెట్లపై కూడా సానుకూలంగా కనిపించింది. అయితే, బుధవారం ఆర్బీఐ పాలసీ సమీక్ష జరగనున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఇక డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 96.30 వద్ద బలహీనంగా ట్రేడ్ అయింది. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించాలని, మార్కెట్ పతనమైనప్పుడు నాణ్యమైన షేర్లలో పెట్టుబడులు పెట్టడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588